2020 మార్చి 31



కరోనా ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోకి అడుగిడింది. ఢిల్లీలో మతపరమైన సమావేశానికి హాజరై వచ్చిన కొందరు అస్వస్థతకు గురయ్యారు. వారికి పరీక్షలు నిర్వహించగా 19 మందికి కరోనా సోకినట్టు నిర్ధారణ అయ్యింది. అక్కడి నుంచి నెలల తరబడి వేలాది కేసులు నమోదయ్యాయి. కరోనా బారి నుంచి తప్పించుకునేందుకు జనం నానా తంటాలు పడ్డారు. జనం చిగురుటాకుల్లా వణికిపోయారు. ఆసుపత్రుల్లో చేరారు. తర్వాత క్రమేపీ శాంతించింది. ఏడాది తర్వాత అంటే 2021 మే 20వ తేదీ నాటికి కరోనా మరోసారి విరుచుకుపడింది. జిల్లావ్యాప్తంగా ఆనాడు కరోనా బారిన పడిన వారి సంఖ్య 50 వేల మందికిపైగానే ఉంది. వారిలో అత్యధికులు హోం ఐసోలేషన్‌లో ఉండగా మరికొందరు ఆసుపత్రుల్లో చేరారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా దాదాపు 1158 మంది కరోనా బారిన పడి మృత్యువాతపడ్డారు. ఈ సంఖ్య అధికారికంగా ఉండగా ఇక చెప్పనలవికాని స్థితిలో పెద్ద సంఖ్యలో ప్రాణాలు కోల్పోయింది ఎందరో.!

2020 డిసెంబరు 5



ఏలూరు నగరం ఒక్కసారిగా ఉలిక్కిపడింది. నగరవాసులు ఎక్కడికక్కడ హఠాత్తుగా ఏదో సోకినట్టు కూలపడ్డారు. వీరందరినీ పరుగు పరుగున ఏలూరు జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించారు. దాదాపు మూడు వారాలపాటు ఇదే తరహా బీభత్సం. అసలు ఈ వ్యాధి ఎవరికీ అంతుపట్టలేదు. ఎందుకు సోకుతుందో అర్థం కాలేదు. వెనుతిరిగి చూసుకునే సరికి ఒకరు మృతి చెందగా 987 మంది ఆసుపత్రులపాలయ్యారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు అసలు ప్రజలకు సోకిన ఈ వ్యాధి ఏమిటో తెలియని వింత ప్రశ్నే మిగిలిపోయింది.

2024 మార్చి 14




జంగారెడ్డిగూడెంలో ఎక్కడికక్కడ పిట్టలు రాలినట్టు జనం రాలిపోయారు. సారా మహమ్మారితో ఈ పరిణామాలు చోటు చేసుకున్నట్టు స్థానికంగా అంచనా కట్టారు. వీధి వీధిన నాలుగు రోజుల పాటు 26 మందికిపైగా మృత్యువాతపడ్డారు. పరిస్థితి ఏంటో అంతు తేల్చేందుకు నిపుణులు రంగంలోకి దిగినా ఎటూ తేల్చలేకపోయారు. సారాతో మృత్యువాత పడినట్టు అప్పట్లో తెలుగుదేశం నిర్ధారణ కు వచ్చి రూ.లక్ష చొప్పున ఒక్కో కుటుంబానికి పరి హారం ఇచ్చింది. చంద్రబాబు వచ్చి బాధితులను ఓదా ర్చారు. అయితే అసలు జరిగింది ఏమిటో ఇప్పటికీ తేల్చలేకపోయారు.

2025 ఫిబ్రవరి 9



ఉమ్మడి పశ్చిమలో బర్డ్‌ఫ్లూ కలకలం. కానూరులోని ఓ ఫౌల్ట్రీలో ఈ వైరస్ దాడి చేసింది. తర్వాత వేల్పూరు, బాదంపూడి పౌల్ట్రీల్లో విజృంభించి లక్షలాది కోళ్ల గిలగిలకొట్టుకుంటూ మృత్యువాత పడ్డాయి. బర్డ్‌ఫ్లూ సోకి కోళ్లను కాటేసినట్టు ఆనక పరీక్షల్లోను నిర్ధారణ అయ్యింది. నిత్యం కోడి మాంసం ఆరగించే జనం ఆ వైపు కన్నెత్తి చూడడమే మానేశారు. పౌల్ట్రీ యజమానులకు కోట్లలో నష్టం.

ఇంతటితో ఆగిందా అంటే చింతలపూడి మండలం యర్రగుంటపల్లిలో జీబీఎస్ వైరస్ కలకలం రేపింది. ఫిబ్రవరి 14న ఒక బాలిక ఈ వైరస్ బారిన పడడంతో ఒక్కసారిగా జిల్లాలో ఆందోళన చెలరేగింది. ఒకే నెలలో ఈ రెండూ జనం కంటి మీద కునుకు లేకుండా చేశాయి. బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు.



జిల్లాపై వైరస్ దాడి చేసింది. ఒక వైపు బర్డ్‌ఫ్లూ భయపెడుతుంటే మరోవైపు గులియన్ బారే సిండ్రోమ్ (జీబీఎస్) కలకలం రేపుతోంది. బర్డ్‌ఫ్లూ భయం లేదని, జీబీఎస్ సాధారణ సమస్య అని నిపుణులు చెబుతున్నా ప్రజలు నాలుగైదేళ్ల నాటి కరోనా పరిస్థితులను గుర్తు తెచ్చుకుని ఆందోళన చెందుతున్నారు. అధికారులు ముందస్తు చర్యలు చేపడుతూనే భయ పడనవసరం లేదని భరోసా ఇస్తున్నారు. అదే సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తలు వివరిస్తున్నారు. ప్రధానంగా కోళ్ల ఫారాల నుంచి బర్డ్‌ఫ్లూ వ్యాప్తి చెందకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టారు. జీబీఎస్ వైరస్ సోకితే ఎదర్కోడానికి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో ప్రత్యేక వార్డును ఏర్పాటు చేశారు. వైద్య నిపుణులు సర్వసన్నద్ధంగా ఉన్నారు.

వణికిస్తున్న వైరస్

ఉమ్మడి జిల్లాలో బర్డ్‌ఫ్లూ.. జీబీఎస్‌లతో భయం.. భయం



- వరుస విపత్తులతో ప్రజల్లో కలవరం
- వెంటాడుతున్న ఐదేళ్ల నాటి కరోనా జ్ఞాపకాలు
- కళ్ల ముందు కదులుతున్న ఏలూరు వింత వ్యాధి
- జంగారెడ్డిగూడెంలో అంతుచిక్కని మరణాలు
- అన్నిటికీ మూలం వైరస్.. వైరస్..!?
- భయం వద్దని భరోసా ఇస్తున్న అధికారులు
- ప్రజారోగ్య, పశుసంవర్ధక శాఖల సమన్వయం
- ముందస్తు చర్యలతో కార్యాచరణ
- విపత్తును ఎదుర్కొనేందుకు సర్వ సన్నద్ధం

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

వేసవి సీజన్ ఆరంభం ప్రజలను వణికిస్తోంది. నాలుగైదేళ్లుగా శీతాకాలం చివరి దశ నుంచి వైరస్ వ్యాప్తితో వ్యాధుల విజృంభణ గుర్తు చేసుకుని ప్రజలు భయపడుతున్నారు. 2020, 2021లో రెండేళ్లపాటు ప్రపంచాన్ని గడగడలాడించిన కరోనా జిల్లా ప్రజలను వణికించింది. వందలాది మందిని పొట్టనపెట్టుకుంది. కుటుంబాలకు కుటుంబాలే గాలిలో కలిసిపోయేలా చేసింది. పనిలేక పస్తులున్న కుటుంబాలెన్నో. ప్రాణాలు అరచేత పట్టుకుని ప్రయాణాలు మానేసి పనులకు స్వస్తి చెప్పి బతుకు జీవుడా అంటూ ఇంటి పట్టునే ఇష్టదైవాన్ని తలచుకుంటూ కాలం గడిపారు. ఆత్మీయులు చనిపోయినా కడసారి చూపు దక్కలేదు. అంత్యక్రియల్లోను ఊహించని పరిణామాలు. ఒకరికొకరు ప్రియ సంభాషణలు లేకుండానే నెలల తరబడి కరోనా భయంతో బిగుసుకుపోయారు. అప్పట్లో నిత్యం రద్దీగా కనిపించినవి ఒకటి ఆసుపత్రి, రెండోది మెడికల్ షాపు. ఇవి తప్ప ఎక్కడా ఏదీలేని పరిస్థితి ఆనాడు ఆవిష్కృతమైంది. కళ్లెదుట జరిగిన సంఘటనలు అందరినీ కలిచివేశాయి. రెండేళ్ల మనుషుల జీవన శైలిలో పెను మార్పులు తెచ్చాయి. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా అంతటా దాదాపు వందలాది మంది మృత్యువాత పడినట్టు అధికారిక లెక్కలు చెబుతుండగా వాస్తవంగా అంతకుమించి అనేకమంది అశువులు బాసారు. ఆనాటి విషాదం అనేక కుటుంబాలను ఇప్పటికీ వెన్నాడుతూనే ఉంది. వేసవి వస్తుందంటే చాలు మరేదైనా పొంచి ఉందా అనే భయం అందరి కళ్లలో కనిపిస్తుంటే ఇప్పటి బర్డ్‌ఫ్లూ, జీబీఎస్ బెంబేలెత్తిస్తున్నాయి.

చింతలపూడి మండలం యర్రగుంట పల్లిలో ఒకరికి జీబీఎస్ వైరస్ నిర్ధారణ అయ్యింది. అంతే జనమంతా మూకుమ్మడిగా వ్యాపార సముదాయాలవైపు రావడం మానేశారు. రద్దీగా ఉండే ప్రాంతాలు ఇప్పుడు పలుచపడ్డాయి. బస్సుల్లో ప్రయాణాలు తగ్గుముఖం పట్టాయి. బర్డ్‌ఫ్లూ, ఇంకోవైపు జీబీఎస్ ఉక్కిరిబిక్కిరి చేశాయి.

హఠాత్తుగా కుప్పకూలారు..!

కరోనా ముగిసి ముగియగానే ఏలూరు నగరంలో వింత వ్యాధి కల్లోలం రేపింది. వయస్సుతో సంబంధం లేకుండా ఎక్కడికక్కడ హఠాత్తుగా కుప్పకూలిపోయిన వారిని ఆసుపత్రికి చేర్చడమే స్థానికులకు పనిగా తయారైంది. 2020 డిసెంబరు ఏలూరు నగరాన్ని గుక్కతిప్పుకోనీ యకుండా చేసింది. ఉన్నట్టుండి ఒక్కసారిగా అదుపు తప్పి కూలబడిపోవడం, వింత చేష్టలతో గందరగోళం, మరికొందరు మూర్ఛసోకినట్టు ప్రవర్తించడం ఇలా రకరకాలుగా ఏలూరు నగరమంతటా వీధుల వారీగా కేసులు నమోదయ్యాయి. వారందరినీ ఆగమేఘాల మీద జిల్లా కేంద్ర ప్రధాన ఆసుపత్రికి తరలించాల్సి వచ్చింది. కేవలం ఒకరిద్దరితో ఆరంభమైన వింత వ్యాధి కాస్తా ఒక్క నెలలోనే వెయ్యి వరకు చేరింది. ఆసుపత్రికి వస్తున్న రోగులు ఏ వ్యాధికి గురయ్యారో కూడా వైద్యులు నిర్ధారించలేకపో యారు. వచ్చిన వారందరికీ సెలైన్ పెట్టి తాత్కాలిక ఉపశమనం చేశారు. కేవలం కొన్ని గంటల వ్యవధిలోనే రోగి కోలుకోవడంతో ఇంటికి పంపేశారు. దీనికి గల కారణాలు ఏమిటని నిర్ధారించేందుకు ఢిల్లీ ఎయిమ్స్ ప్రత్యేక వైద్యుల బృందం ఏలూరు చేరుకుని వాడవాడలా విశ్లేషించింది. పూణె నుంచి వచ్చిన మరొక నిపుణుల బృందం కూడా రోగి లక్షణాలు ఆ క్షణంలో వారి మానసిక స్థితి, ఆరోగ్య స్థితి ఉన్నట్టుండి కుప్పకూలిపోవడం వెనుక దాగి ఉన్న రహస్యాన్ని ఛేదించేందుకు విశ్వప్రయత్నం చేశారు. కొందరేమో కూరగాయలే కారణమని, మరికొందరేమో పారిశుధ్య లోపం, తాగునీటిలో వ్యర్థాలు కారణమని ఎవరంతట వారు విశ్లేషించారు. అత్యాధునిక ల్యాబ్‌ల్లో పరిశోధనలో కడకు ఈ వ్యాధి ఏమిటో తెలియక వింత వ్యాధిగానే మిగిలిపోయేలా చేశారు. ఇప్పటివరకు ఏలూరులో వింత వ్యాధి.. కారణాలు ఏమిటి అనే ప్రశ్నకు ఈనాటికి సమాధానం దొరకలేదు.

బర్డ్‌ఫ్లూ భయం


తాజాగా వేసవి సీజన్‌కు ముందుగానే జిల్లాను మరో ఉపద్రవం గడగడలాడించింది. కానూరు, వేల్పూరు, బాదంపూడి గ్రామాల్లో బర్డ్‌ఫ్లూ వైరస్ ప్రబలి వేల కోళ్ల మృత్యువాత పడ్డాయి. దీనితో కోళ్ల, గుడ్ల అమ్మకాలు ఒక్కసారిగా పడిపోవడంతో పౌల్ట్రీ రైతులకు కోట్లలో నష్టం మిగిల్చాయి. బర్డ్‌ఫ్లూ సోకడం జిల్లాలో ఇదే ప్రథమం. ఇకముందు ఇతర ప్రాంతాల్లో బర్డ్‌ఫ్లూ పదం వినపడితే ఇక్కడ పౌల్ట్రీ రైతులు వణికిపోయేవారు. ఏ వైరస్ అయితే కోళ్లకు సోకరాదని వారు కోరుకున్నారో అదే వైరస్‌తో నష్టాలపాలయ్యారు.



పడిపోయిన చికెన్ ఆధారిత వ్యాపారాలు

బర్డ్‌ఫ్లూ కారణంగా చికెన్ ఆధారిత వ్యాపారులు కొండెక్కాయి. సాయంత్రం అయితే చాలు బిర్యానీ పాయింట్లు, చికెన్ పకోడీ సెంటర్లు కిటకిటలాడేవి. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని ఏలూరు, భీమవరం, తణుకు, తాడేపల్లిగూడెం, పాలకొల్లు, నరసాపురం, జంగారెడ్డిగూడెం, నూజివీడు తదితర పట్టణాల్లో వేలాది కేజీల కోడి మాంసం వంటకాల విక్రయాలు జరిగేవి. ఇప్పుడు ఆ పరిస్థితి లేకపోవడంతో వ్యాపారులు ఉసూరుమంటున్నారు. దీనిపై ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం.. 6లో..

ఆందోళన చెందకండి : మంత్రి పార్థసారథి



జీబీఎస్ వైరస్‌తో ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో అత్యవసర మందులు, ఇంజక్షన్లు అందుబాటు ఉంటాయి. కార్డియాలజీ, న్యూరాలజీ, జనరల్ మెడిసిన్ విభాగాల్లో అత్యవసర మందులు అందుబాటులో ఉంచాల్సిందే. జీబీఎస్ సోకిన రోగులకు ఆరోగ్యశ్రీ ద్వారా చికిత్స చేస్తారు. చికిత్స తీసుకోకుండానే చాలావరకు ఈ వ్యాధి తగ్గుతుంది. ప్రజలు ఒకింత అవగాహనతో ఆసుపత్రుల్లో వైద్యులను సంప్రదించాలి తప్ప భయాందోళనకు గురికావద్దు.



2020 జులైలో కరోనా నిర్ధారణ పరీక్షలు (ఫైల్)



ఏలూరు ఆస్పత్రిలో వింత వ్యాధితో బాధితుడు (ఫైల్)



వేల్పూరు పౌల్ట్రీ వద్ద బ్లీచింగ్‌తో ప్రత్యేక పారిశుధ్యం



పెదతాడేపల్లిలో కోళ్ల ఖననానికి సిద్ధమైన సిబ్బంది

అపరాల పంటకు తెగుళ్ల తాకిడి

మినుము, పెసరపై పల్లాకు, బూడిద తెగులు

- రోజుల వ్యవధిలో పంట మొత్తం వ్యాప్తి
- ఎండుతున్న మొక్క.. రాలుతున్న పూత



ఏలూరు రూరల్, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): పూతదశలో ఉన్న మినుము, పెసర పంటలపై పల్లాకు, బూడిద తెగుళ్ల సోకడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మందులు పిచికారి చేసినా తెగులు వ్యాప్తి తగ్గడం లేదని రైతులు వాపోతున్నారు. తెగులు ప్రభావంతో మొక్క ఎండిపోతోంది. పూత రాలిపోతోంది. ఎన్నిసార్లు మందులు పిచికారి చేసినా ఉపయోగం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పురుగు మందులు పిచికారి మరింత భారంగా మారిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏలూరు, దెందులూరు నియోజకవర్గాల్లోని పలు ప్రాంతాల్లో వరిసాగు చేసిన పొలాల్లో రైతులు పంట కోత అనంతరం మినుము, పెసర, అపరాల పంట వేశారు. ప్రస్తుతం పల్లాకు తెగులు సోకింది. కృష్ణా డెల్టా పరివాహక ప్రాంతాల్లో ఏలూరు రూరల్ మండలంలోని లింగారావుగూడెం, కాట్లంపూడి తదితర ప్రాంతాల్లో అపరాలు వేశారు. కృష్ణా డెల్టా పరివాహక ప్రాంతమైన కైకలూరులో సుమారు 35 ఎకరాల్లో అపరాల సాగు జరుగుతుంది. దాదాపు 30 ఎకరాలకు పైగా తెగుళ్ల సోకాయి. రెండో పంటకు సాగు నీరు లేకపోవడంతో ఏలూరు, దెందులూరు, పెదపాడు మండలాల్లో వేలాది ఎకరాల్లో రైతులు అపరాల పంట సాగుచేశారు. వేలాది రూపాయలు పురుగు మందులు ఖర్చు చేశారు. పూత, పిందెదశలో పంటలు ఎండి పోతున్నాయి. మినుము ఆకులు గిడసబారి పసుపు రంగులోకి మారుతున్నాయి. ఒక మొక్కకు సోకిన తెగులు, రోజుల వ్యవధిలోనే పొలం మొత్తం విస్తరిస్తోంది. ఇక బూడిద తెగులు ఆశించిన పొలాల్లో మినప మొక్కపై తెల్లటి మచ్చలు ఏర్పడి ఎండిపోతున్నాయి. ఎకరాకు రూ.25 వేలకు పైగా పెట్టుబడి పెట్టినా, దిగుబడి వచ్చే పరిస్థితులు లేవు. ఎకరాకు రెండు, మూడు క్వింటాళ్ళు కూడా దిగుబడి రాదని రైతులు వాపోతున్నారు.

ప్రభుత్వం ఆదుకోవాలి : ఎనికే దేవిడ్‌రాజు



తెగుళ్ల నివారణకు వేలాది రూపాయలు ఖర్చు చేశాం. ఫలితం లేకుండా పోయింది. ప్రస్తుతం పంట పూత దశలో ఉంది. తెగుళ్లతో పంట ఎండిపోతుంది. ఎకరాకు రెండు, మూడు క్వింటాళ్ల దిగుబడి వచ్చే పరిస్థితి కనిపించడం లేదు. నష్టపోతున్న అపరాల రైతులను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలి.

అధికారులు దృష్టిసారించాలి : ఎం.సుబ్బారావు, మాదేపల్లి



కొత్త కౌలుచట్టం తెస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చి పట్టించుకోని పరిస్థితి ఉంది. ప్రభుత్వం అందించే ఏ ఒక్క రూపాయి సాయం కౌలురైతులకు అందడం లేదు. అపరాల రైతుల సమస్యలపై అధికారులు దృష్టిసారించాలి. ప్రభుత్వం అపరాల రైతులకు అండగా ఉండాలి.

సచివాలయాల్లో ఆధార్ సేవలు

- జిల్లాలో 56 ప్రత్యేక శిబిరాలు
- ఈనెల 30 వరకు నిర్వహణ



మల్కాపురంలో ఏర్పాటు చేసిన శిబిరంలో ఆధార్ నమోదు చేస్తున్న సిబ్బంది

ఏలూరు రూరల్, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): ప్రజలకు ఆధార్ గుర్తింపు తప్పనిసరి. ప్రభుత్వ సంక్షేమ పథకాలకు విద్య, ఉద్యోగాల్లో ప్రవేశాల కు దీనిని కేంద్ర, రాష్ట్ర ప్రభు త్వాలు తప్పనిసరి చేశాయి. కొందరి కార్డుల్లో తప్పులు ఉన్నాయి. వీటిని సవరించుకోవడానికి ప్రభుత్వం అవకాశం కల్పించింది. మంగళవారం నుంచి సచివాల యాల్లో ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తోంది. ప్రతి పదేళ్లకు ఒకసారి ఆధార్‌కార్డును తప్పనిసరిగా నవీకరణ చేయాలి. వృద్ధుల్లో చాలా మందికి వేలిముద్రలు అరిగిపోతాయి. ఈ క్రమంలో ఐరిస్ ఉపయోగపడుతుంది. అప్పుడే పుట్టినబిడ్డ దగ్గర నుంచి ఐదేళ్లలోపు వారికి బాల ఆధార్ కార్డులు ఇస్తున్నారు. ఏలూరు జిల్లాలో 56 ఆధార్ ప్రత్యేక శిబిరాలు ఈ నెల 30 వరకు నిర్వహిస్తున్నారు. ఆధార్‌కార్డుల్లో పేరు, ఫొటో, ఫోన్ నెంబర్, చిరునామా మార్పులు చేసుకోవచ్చు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చి స్థిర పడిన వారికి ఇది సరైన అవకాశం. సరైన ధ్రువ పత్రాల్లో పుట్టిన తేదీ, పేరు మార్పులు చేసుకోవచ్చు.

ఐదేళ్లలోపు వారికి కొత్త కార్డులు

ఏలూరు రూరల్ మండలంలో ప్రస్తుతం చాటపర్రు, మల్కాపురం గ్రామాల్లో ప్రత్యేక ఆధార్ శిబిరాలు నిర్వహిస్తున్నాం. ప్రతి ఒక్కరూ వీటిని సద్వినియోగం చేసుకోవాలి. ఈనెల 30 వరకు ప్రత్యేక శిబిరాలు కొనసాగుతాయి. చిన్న పిల్లలకు కొత్తగా నమోదు చేసుకోవచ్చు. నమోదై పదేళ్లు దాటిన వారు నవీకరణ చేసుకోవాలి. వివరాల్లో తప్పులు సవరించుకోవచ్చు.

- శ్రీలత, ఎంపీడీవో

బలివే ఉత్సవాలకు పటిష్ఠ ఏర్పాట్లు చేయాలి

- కలెక్టర్ వెట్రిసెల్వి



బలివే ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి

ముసునూరు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): బలివే రామలింగేశ్వర స్వామి మహాశివరాత్రి ఉత్సవాలను అన్నిశాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి అన్నారు. మంగళవారం ఉత్సవాల ఏర్పాట్లును ఆమె పరిశీలించారు. అనంతరం వివిధ శాఖల అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రూ.100, రూ. 25తోపాటు ఉచిత దర్శనానికి ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేయాలన్నారు. స్నానఘట్టాల వద్ద జల్లుల స్నానాలు ఏర్పాటు, పిండ ప్రదానాలకు ప్రత్యేక ప్రదేశంలో ఏర్పాటు, మహిళలు బట్టలు మార్చుకునేందుకు ప్రత్యేకంగా గదులను ఏర్పాటు చేయాలని సూచించారు. అలాగే ఘాట్ల వద్ద గజ ఈతగాళ్ల పర్యవేక్షణ ఉండాలని అన్నారు. పిండ ప్రదానాలు చేసే పురోహితులకు గుర్తింపు కార్డులు జారీ చేయాలని సూచించారు. సమావేశంలో దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్ రంగారావు, ఈవో పామర్తి సీతారామయ్య, తహసీల్దార్ కె.రాజ్‌కుమార్, ఎంపీడీవో జి.రాణి, సీఐ రామకృష్ణ, ఎస్ఐ చిరంజీవి, డీఎల్‌సీవో సుందరి, వైద్యాధికారి షకీనా ఇవాంజలి పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు జ్ఞాన జ్యోతి శిక్షణ



శిక్షణలో మాట్లాడుతున్న ఐసీడీఎస్ పీడీ శారద

ఏలూరు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): పల్లెలు, పట్టణాల్లో అంగన్‌వాడీ కేంద్రాలు బాల్యానికి బడిగా మారే విధంగా టీచర్లు చిత్తశుద్ధితో పిల్లలను తీర్చిదిద్దేందుకు జ్ఞానజ్యోతి శిక్షణ ఉపకరిస్తుందని ఏలూరు జిల్లా స్త్రీ, శిశుసంక్షేమశాఖ ప్రాజెక్టు డైరెక్టర్ పి శారద పిలుపునిచ్చారు. జిల్లాలోని 2225 అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో 1915 మంది టీచర్లకు 29 కేంద్రాల పరిధిలో జ్ఞానజ్యోతి కార్యక్రమం కింద మంగళవారం ప్రారంభమైన శిక్షణ 20 వరకు కొనసాగుతుందన్నారు. శనివారపుపేట జెడ్పీ హైస్కూల్ కేంద్రంలో జరిగిన శిక్షణకు ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని శారద మాట్లాడారు. 28 మండలాల్లో ఈ కార్యక్రమం ద్వారా నూతన విద్యావిధానం అమలుపై శిక్షణ ఇస్తున్నామని, దీని ద్వారా టీచింగ్ స్కిల్స్‌ను పెంచుకుని, అంగన్‌వాడీ నుంచి పాఠశాలకు వెళ్లే పిల్లలకు మంచి అలవాట్లు బోధించే కేంద్రంగా మారాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ కార్యాలయ ఈవో వి.మల్లిక, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

నేడు ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను సందర్శించనున్న జర్మన్ బృందం


ఏలూరు సిటీ, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): రైతు సాధికార సంస్థ ఆంధ్రప్రదేశ్ ప్రజా భాగస్వామ్య ప్రకృతి వ్యవసాయ కార్యక్రమం (ఏపీసీఎన్‌ఎఫ్) ద్వారా అమలు చేస్తున్న ప్రకృతి వ్యవసాయ క్షేత్రాల పరిశీలనకు జర్మన్ ప్రతినిధి బృందం నేడు జిల్లాలో పర్యటించనుంది. నలుగురు సభ్యుల బృందంలో ఫౌండేషన్ ఆన్ ఫ్యూచర్ ఫార్మింగ్ తరఫున జాస్పర్ జోర్డాన్, లెన్నెడిక్ట్ హెర్లిన్, పోర్చుగల్‌కు చెందిన ప్రాజెక్టు ఎర్త్ ప్రతినిధి డియోగో కౌటినో, అటెలియర్ ఫుడ్ సిస్టమ్ చేంజ్ ప్రతినిధి లూకస్ కేహ్లే ఉన్నారు. వెంకటాపురం, ఆడమిల్లి, గుండుగొలను గుంట గ్రామాల్లో పర్యటిస్తారు. రైతులను అడిగి వివరాలను తెలుసుకుంటారు.

అధికారితో..

ఆంధ్రజ్యోతి ఫోన్ ఇన్

ఏలూరు పోలీసు సబ్ డివిజన్‌లోని శాంతి భద్రతలు, ప్రజా సమస్యలపై ఆంధ్రజ్యోతి ఫోన్ ఇన్ నిర్వహించనుంది. ఏలూరు వన్, టూ, త్రీ టౌన్, రూరల్, ట్రాఫిక్, మహిళ, సీసీఎస్, ద్వారకా తిరుమల, గణపవరం, నిడమర్రు, చేబ్రోలు, భీమడోలు, కైకలూరు టౌన్, రూరల్, ముదినేపల్లి, మండవల్లి, కలిదిండి పోలీసు స్టేషన్ల పరిధిలోని సమస్యలపై ఏలూరు డీఎస్పీ డి.శ్రావణ్‌కుమార్ సమాధానం ఇస్తారు. సమస్యలపై ప్రజలు ఫోన్ చేయాల్సిన సమయం : బుధవారం ఉదయం 11 - 12 గంటల మధ్య.

సెల్ నెంబరు : 70136 20539



కలెక్టరేట్‌లో పోస్టల్ బ్యాలెట్

ఓటు వేసే పట్టభద్రులకు ప్రత్యేక సెలవు

7

కూలీలపైకి దూసుకెళ్లిన ట్రాక్టర్

మహిళ మృతి, ముగ్గురికి గాయాలు

కుంతలగూడెంలో విషాదం



ఐడియా అదిరింది !

తాడిచెట్లకు వాటర్ బాటిళ్లు

కూటికోసం కోటి విద్యలు అన్నారు..దాన్నే కొద్దిగా మార్చి ఉపాధికోసం సవాలక్ష ఐడియాలు అన్నట్టుగా ఆచరణలో పెట్టారు పోలవరానికి చెందిన కొంతమంది కల్లుగీత కార్మికులు.. పరిస్థితులు, అవసరాలను బట్టి మన ఆలోచనలు కూడా మారు తుంటాయి... అందుకే వీళ్లకి ఇటువంటి ఆలోచన తట్టింది.. కల్లు గీత గీసేవారు గతంలో తాడిచెట్లకు కల్లు సేకరణ కోసం కుండలు కట్టేవారు. ఇటీవల కాలంలో కుండల ధరలు పెరిగాయి.. కొంతమంది ఆకతాయిలు రాళ్లతో కుండలకు చిల్లుపెట్టి కల్లు తాగండం వంటిచేస్తున్నారు.. ఇలాంటి సమస్యలు తలెత్తకుండా ఉండేందుకు తాడిచెట్లకు ఐదు లీటర్లు, రెండు లీటర్ల వాటర్ బాటిళ్ళు కడుతున్నారు.కుండలు కట్టడం వల్ల కుండ కొంత కల్లుని పీల్చు కుంటుందని, గాలులకు ఒక్కో సందర్భంలో కుండలు పగులుతున్నాయని కుల్లుగీత కార్మికులు చెబుతున్నారు. పైగా ఒక్కో కుండ రూ.150 నుంచి 200 వరకూ ధరలు పలుకుతున్నాయని, వాటర్ బాటిళ్ళ వాడకం వల్ల ఖర్చు కూడా తగ్గుతుందని తెలిపారు. కుండలు కట్టడం వల్ల చెట్టు ఎక్కేవరకూ కుండలో కల్లు ఉందో లేదో చూసే వీలుండదని, కుండలో కల్లు లేకపోతే కష్టపడి చెట్టు ఎక్కి దిగడం వృధా ప్రయాస అని, బాటిళ్ళు కట్టడం వల్ల బాటిళ్ళలో కల్లు స్పష్టంగా కనిపిస్తుందని తెలిపారు. బాటిళ్లతో సేకరించిన కల్లుని కుండల్లో పోస్తామని తెలిపారు. ఈ ఐడియా బావుండడంతో చాలామంది గిరిజనులు ఇదే పద్ధతి కొనసాగిస్తున్నారు. తాడిచెట్లకు వాటర్ బాటిళ్ళు వేలాడు తుండడంతో ఆ మార్గంలో రాకపోకలు సాగించేవారు వింతగా చూస్తున్నారు.

- పోలవరం (ఆంధ్రజ్యోతి)

తాడేపల్లిగూడెం పట్టణంలోని ఓ రెస్టారెంట్‌లో రోజూ 150 కేజీల చికెన్ వంటకాలు చేసేవారు. ఆదివారం అయితే 300 కేజీల వరకూ చికెన్ వండేవారు. బర్డ్‌ఫ్లూ భయంతో మాంసాహార ప్రియులు హోటల్స్‌కు వెళ్లడం మానేశారు. వెళ్లినా నాన్‌వెజ్ జోలికి వెళ్లడం లేదు. నాన్ వెజ్ తీసుకున్నా చికెన్ జోలికి అసలు వెళ్లడం లేదు. దీంతో ఆ హోటల్‌లో చికెన్ వినియోగం 10 కేజీలకు పడిపోయింది. ఇక్కడే కాదు.. ఉమ్మడి జిల్లాలో వైరస్ ప్రభావిత ప్రాంతాల్లో ఇలాంటి పరిస్థితే ఉంది..

కోడీలా !



పడిపోయిన చికెన్ ఆధారిత వ్యాపారాలు

మూతపడిన బిర్యానీ, పకోడి దుకాణాలు
వెలవెలబోతున్న రెస్టారెంట్‌లు
వేల మంది ఉపాధికి గండి
మటన్, రొయ్యల బిర్యానీల అమ్మకాలు
చికెన్ ప్రియులకు గడ్డు రోజులు

తణుకు రూరల్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : కోళ్లకు సోకిన బర్డ్‌ఫ్లూ వైరస్‌తో ఉభయ గోదావరి జిల్లాల్లోని కోడిగుడ్లు, చికెన్‌పై ఆధారపడి చేసే వివిధ చిరు వ్యాపారాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. పట్టణం నుంచి పల్లె వరకూ విస్తరించిన చికెన్ బిర్యాని, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లలో చికెన్, గుడ్లను విరివిగా ఉపయోగిస్తారు. బిర్యానీ వినియోగంలో 90 శాతం చికెన్‌తో చేసిన వంటకాలనే ప్రజలు ఆహారంగా విని యోగిస్తున్నారు. వారం క్రితం తణుకు రూరల్ మండలం వేల్పూరు, పెరవలి మండలం కానూరు, ఉంగుటూరు మండలం బాదంపూడి గ్రామాల్లోని పౌల్ట్రీ ఫారాల్లో వెలుగు చూసిన బర్డ్ ఫ్లూ వైరస్ కారణంగా ఈ మూడు ఫారాలకు సుమారు 10 కిలోమీటర్ల పరిధిలో అలెర్ట్ జోన్‌గా అధికారులు ప్రకటించారు. దీనితో ఈ అలెర్ట్ జోన్‌లో చికెన్, కోడిగుడ్లు అమ్మకాలు,విని యోగంపై నిషేధం విధించారు. ఆయా గ్రామాలకు పది కిలోమీటర్ల పరిధి దాటిన తర్వాత ప్రాంతాల్లో కూడా చికెన్, కోడిగుడ్లు వినియోగం తగ్గిపోవడంతో పలావ్, బిర్యానీ, ఫ్రైడ్‌రైస్, అమ్మే దుకాణాలపై ప్రభావం ఎక్కువగా పడింది. గ్రామాలు మొదలు కొని పట్టణాల్లో వున్న బిర్యానీలు సెంటర్లు, చికెన్ పకోడి దుకాణాలు సుమారు 80 శాతం వరకూ మూతపడగా మిగిలిన వాటిలో మటన్, రొయ్యలతో తయారు చేసిన బిర్యానీలు, పకోడీలను తయారు చేసి అమ్మకాలు సాగిస్తున్నారు.

> ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో చిన్న, పెద్ద కలిపి సుమారు రెండు వేల చికెన్ పలావు, చికెన్ పకోడి దుకాణాలు వుండగా వాటిలో సుమారు 8 వేల మంది ప్రత్యక్షంగా, మరో 10 వేల మంది పరోక్షంగా ఉపాధి పొందుతున్నారు. రోజూ సుమారు 20 వేల కోళ్ల చికెన్ కోసం మరో 5 వేల కోళ్ల చికెన్ పకోడి కోసం వినియోగం జరుగు తుంది. బర్డ్‌ఫ్లూ ప్రభావంతో ఆయా దుకాణాల్లో పనిచేసే కూలీలు ఉపాధి కోల్పోయారు.

మటన్, రొయ్యు పలావ్

బర్డ్ ఫ్లూ వైరస్ కారణంగా ఆయా ఫారాల పరిధిలో ఒక కిలో మీటరులో రెడ్‌జోన్, 10 కిలోమీటర్లు పరిధిలో అలెర్ట్ జోన్‌లుగా ప్రభుత్వ ప్రకటించి చికెన్, గుడ్లు అమ్మకాలను నిషేధించడంతో వాటిపై ఆధారపడి సాగే వ్యాపారాలు పడి పోయాయి. ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలకు అందించే గుడ్లను కూడా వినియోగించవద్దని ఆదేశాలు జారీ చేయడంతో తగ్గించేశారు. బిర్యానీ, పకోడి దుకాణాలు చాలా వరకూ మూతపడగా ఉన్నవాటిలో మటన్,రొయ్యలతో పలావు, బిర్యానీ తయారు చేసి అమ్ముతున్నారు. వీటి ధరలు ఎక్కువ కావడంతో బిర్యాని ధర కూడా పెంచడంతో కొనేవారు తగ్గిపోయారని దుకాణదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో 150 కిలోల నుంచి 200 కిలోల చికెన్‌తో తయారు చేసిన బిర్యానీ దుకాణాలు నేడు 10, 20 కిలోల మటన్, రొయ్యలతోనే బిర్యానీ తయారు చేసి అమ్మకాలు చేస్తున్నారు. గతంలో రూ. 60 నుంచి లభించే ఇప్పుడు రూ. 120 ఇంకా పైనే అమ్మకాలు జరుగుతున్నాయి. గతంలో ఒక్కో షాపులో 50 కిలోల నుంచి 100 కిలోల చికెన్ పకోడీ అమ్మిన షాపులు నేడు చాలా వరకూ షాపులు మూత పడగా కొన్నిటిలో చేపలు, రొయ్యలతో తయారు చేసిన పకోడీలు అమ్ముతున్నారు.



తణుకులో వెలవెల బోతున్న పలావ్ సెంటర్

కొండెక్కిన మేకలు, గొర్రెల ధరలు

చికెన్ వినియోగంపై ఆంక్షలతో మేకలు, గొర్రెల ధరలు పెరిగిపోయాయి. వినియోగానికి తగినంత మేకలు, గొర్రెలు మార్కెట్‌లో అందుబాటులో లేవని వ్యాపారులు పేర్కొంటు న్నారు. గతంలో రూ.12 వేలు అమ్మే 15 కిలోల మేకలు నేడు రూ.20 వేలకు అమ్ముతున్నారు. మన జిల్లాలో పెదతాడేపల్లి మేకలు, గొర్రెలకు పెద్ద మార్కెట్. అక్కడ కూడా అందు బాటులో లేకపోవడంతో ఇతర జిల్లాలోని గోకవరం, మాచర్ల, గుంటూరు, వినుకొండ, చిలకలూరిపేట, హైదరాబాద్ తదితర ప్రాంతాల నుంచి మేకలను కొనుగోలు చేస్తున్నారు.

- **బిర్యానీ వ్యాపారం తగ్గిపోయింది**



చికెన్ బిర్యానీ వినియోగం తగ్గిపో యింది. ప్రజల్లో నెలకొన్న భయంతో చికెన్ బిర్యానీ తయారు చేసినా కొనేవారు లేరు. గతంలో రోజుకు 200 కిలోల చికెన్ బిర్యానీ అమ్మేవాళ్లం. ప్రస్తుతం వృత్తిని వదలేక మటన్‌తో బిర్యానీ తయారు చేసినా 20 కిలోలు కూడా అమ్మలేకపోతున్నాం. మటన్ ధర పెరగ డంతో బిర్యానీ ధర కూడా పెంచవలసి వస్తున్నది.

-బొల్లాడ శ్రీనివాసు, బాలాజీ పలావ్ సెంటర్, నిర్వాహకుడు, తణుకు

- **అలవాటైన వృత్తిని వదల్లేక..**



మొదటి నుంచి అలవాటుగా ఉన్న వ్యాపారం వదల్లేక చేపలతో పకోడి తయారు చేస్తున్నాం. రోజూ ముగ్గురు కూలీ లతో దుకాణం నిర్వహిస్తున్నాం. ఒడిశా రాష్ట్రం నుంచి వచ్చిన వారు కావడంతో వారికి పని కల్పించాలనే ఉద్దేశంతో కూడా చేపలతో పకోడి తయారు చేస్తున్నాం. త్వరలోనే సాధారణ పరిస్థితులు ఏర్పడకపోతే పనుల్లేక ఉపాధి కోల్పోతారు.

-బండి రామకృష్ణ, చికెన్ పకోడి దుకాణ నిర్వాహకుడు, వేల్పూరు

ముద్ద దిగడం లేదు.. మాంసాహారుల దిగాలు

తాడేపల్లిగూడెం రూరల్ (ఆంధ్రజ్యోతి): చికెన్ బాగా తినే చికెన్ ప్రియులకు మాత్రం పరిస్థితి కొంత ఇబ్బంది కరంగానే మారింది. వాస్తవానికి మటన్ కంటే చికెన్ తినే వారి సంఖ్యే ఎక్కువగా ఉంటుంది. చాలా రెస్టారెంట్లలో చికెన్ అమ్మకాలే ఎక్కువగా జరుగుతుంటాయి. తోపుడు బండ్లపై కూడా చికెన్, గుడ్డుతో చేసిన వాటికే ప్రజలు ఎక్కువగా మగ్గు చూపిస్తుం టారు. కొన్ని నెలల పాటు చికెన్‌కు దూరంగా ఉండాలంటే వారికి మింగుడు పడటం లేదు. గతంలో పశ్చిమ గోదారి జిల్లాలో రోజుకు 3 టన్నుల చికెన్ వినియోగించేవారు. ప్రస్తుతం టన్ను కూడా విక్రయాలు సాగడం లేదు. బర్డ్‌ఫ్లూ ప్రభావం లేని ప్రాంతాల్లో మాత్రమే చికెన్ విక్రయాలు జరుగు తున్నాయి. నిషేధిత ప్రాంతాల్లో దుకాణాలు కూడా తీయడం లేదు.

- **చికెన్ అంటే చాలా ఇష్టం..**



చికెన్ అంటే ఎంతో ఇష్టం. చికెన్ తప్ప మరే మాంసాహారం తినను.ఇప్పుడు బర్డ్‌ఫ్లూ ప్రభావంతో చికెన్ తినడం ఆరోగ్యకరం కాదని ప్రచారం జరుగుతుండటంతో తినడం లేదు. దీంతో భోజనంలో చికెన్ లేని లోటు తీరడం లేదు.

చొక్కాపు రామకృష్ణ, తాడేపల్లిగూడెం

రెస్టారెంట్లు వెలవెల

పెంటపాడు, (ఆంధ్రజ్యోతి) : బర్డ్‌ఫ్లూ భయాల కారణంగా చికెన్ దుకాణాలతో పాటూ రెస్టారెంట్‌లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు వెలవెలబోతున్నాయి.చికెన్ అమ్మకాలు తగ్గిపోవడంతో ఇవన్నీ దిక్కుతోచని స్థితిలో పడిపోయాయి. సాధారణంగా రెస్టారెంట్, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లలో చికెన్, గుడ్లతో చేసిన ఆహా రపదార్థాలే ఎక్కువగా అమ్మకాలు జరుగు తుంటాయి.మటన్, రొయ్యలు, పీతలు తదితర వాటితో వ్యాపారాలు సాగించలేక వ్యాపారులు అందరూ డీలా పడిపోయారు.. పరిస్థితి నెల కొంది. తాడేపల్లిగూడెం, పెంటపాడు పరిశర ప్రాంతాలలో ఇప్పటికే బండ్లపై వ్యాపారాలు సాగించే వారు చాలా మంది తీసేశారు. కొంతమంది రొయ్యలు, మటన్ తదితర వాటిని కొద్దికొద్దిగా తెచ్చుకుని వ్యాపారాలు సాగిస్తున్నారు.



పెంటపాడులో వెలవెలబోతున్న రెస్టారెంట్

- **చికెన్ పకోడి వ్యాపారం వదిలేశా..**



చికెన్ అందుబాటులో లేకపోవడంతో పకోడి వ్యాపారాన్ని తాత్కాలికంగా వదిలేశా. గతంలో రోజుకు 50 కిలోల చికెన్ పకోడి అమ్మేవాళ్లం. వారం రోజులుగా చికెన్ అమ్మకాలపై వున్న ఆంక్షలతో పాటు ప్రజలలో నెలకొన్న భయం కారణంగా పకోడి కొనేందుకు ఎవరూ ముందుకు రావడంలేదు.

- ధనరాజు, దుకాణం నిర్వాహకుడు, తణుకు

పెదతాడేపల్లిలో కోళ్లు ఖననం

తాడేపల్లిగూడెం మండలం పెదతాడేపల్లిలో శ్రీరామలక్ష్మి పౌల్ట్రీఫారంలో బర్డ్‌ఫ్లూ కలకలంతో ఇప్పటికే 21 వేల కోళ్లు ఖననం చేయగా మంగళవారం 23 వేల 500 కోడిగుడ్లు, 7 వేల ఫారం కోళ్లు ఐదున్నర టన్నుల కోళ్ల మేత ఖననం చేశారు. పశుసంవర్ధక శాఖ జేడీ కెమురళీకృష్ణ పర్యవేక్షణలో వెటర్నరీ సిబ్బంది ఈ కార్యక్రమం చేపట్టారు. వెటర్నరీ డీడీ సుధాకర్, ఏడీ అనిల్‌కుమార్, కార్యదర్శి టి.రవిచంద్ తదితరులు పాల్గొన్నారు.



పెదతాడేపల్లిలో కోడిగుడ్లు తీసేస్తున్న దృశ్యం



త్రివేణి సంగమంలో స్నానాలు ఆచరిస్తున్న గణపవరం నుంచి వెళ్లిన భక్తులు

మరచిపోలేని అనుభూతి

కుంభమేళాకు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాల నుంచి తరలివెళ్లిన భక్తులు

గణపవరం నుంచి 30 మంది..

గణపవరం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): భారతదేశం సంస్కృతీ, సంప్రదాయ, సనాతన ధర్మానికి పెట్టింది పేరు.. వాటిని ఆచరించే ప్రతీ హిందువు పుణ్యక్షేత్రాలకు తరలివెళ్తుంటారు. 144 సంవత్సరాలకు ఒకసారి జరిగే మహా కుంభమేళా ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని అలహాబాద్ వద్ద ప్రయాగ్ రాజ్‌లో జనవరి 13న ప్రారంభమై ఈనెల 26న మహాశివరాత్రి వరకు కొనసాగనుంది. దేశ నలుమూలల నుంచి రైల్వేశాఖ ప్రత్యేక రైళ్ళను ఏర్పాటు చేయగా ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాల నుంచి భక్తులు కొందరూ రైళ్లల్లో మరికొందరు బస్సులు, ట్యాక్సీలు, ఇతర వాహనాల్లో గ్రూపులు, గ్రూపులుగా తరలివెళ్తున్నారు.గణపవరం నుంచి 30 మంది టావెల్ బస్సు ద్వారా వెళ్లారు.. వారు ఇంకా యాత్రలోనే ఉన్నారు. ఈ యాత్రలో వారి అనుభవాలను ఆంధ్రజ్యోతితో ముచ్చటించారు..

- **ఈ అనుభూతి ఎప్పటికి మరువలేను**



మహాకుంభమేళకు వెళ్లి రావడం ఎంతో ఆనందంగా ఉంది. స్నేహితుల మంతా మినీ ట్రావెల్స్‌లో బృందంగా వెళ్ళాం. అక్కడ పుణ్యస్నానాలు చేశాం. దేశవిదేశాల నుంచి ఎందరో భక్తులు వచ్చారు. ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం ఘాట్ వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. స్వచ్ఛంద సంస్థలు, స్వామిజీలు, మఠాలు కూడా ఆహారపదార్థాలు పంపిణీ చేశారు. దారిలో మేమే స్వయంగా వంటా వార్పు చేసుకున్నాం. దారిలో దేవాలయాలను సందర్శించాం. ఇటువంటి అవకాశం మాకు జీవితంలో రాదు.

- నంద్యాల రాజశేఖర రాజు, గణపవరం

- **పూర్వజన్మ సుకృతం..**



మహాకుంభమేళాకు వెళ్లడం జీవితంలో పూర్వజన్మ సుకృతం. త్రివేణి సంగమంలో పుణ్య స్నానాలు చేశాం. అక్కడి ప్రభుత్వం భక్తుల




యాత్ర మధ్యలో వంటావార్పు.. కాశీలో దీపారాధనలు

కోసం సౌకర్యవంత మైన పటిష్టమైన ఏర్పాట్లు చేసింది. దీంతో అక్కడ పెద్దగా ఇబ్బందులు పడలేదు. కానీ ప్రయాణంలో చాలా ఇబ్బందులు పడ్డాం. మా వాహనం చాలా దూరంగా ఆపేశారు.. సుమారు పది కిలోమీటర్లు పైనే నడుచుకుంటూ వెళ్ళాల్సి వచింది. కాశీ , అయోధ్యలో కూడా భక్తుల రద్దీ విపరీతంగా ఉంది.. ఇక్కడ కూడా వాహనాలను నాలుగైదు కిలోమీటర్ల దూరంలోనే ఆపేస్తున్నారు.. సాధారణ రోజుల్లో కాశీయాత్రకు వెళ్లి వస్తే మనిషికి రూ.10 వేలతో పూర్తయ్యేది.. కుంభమేళా కారణంగా ఇప్పుడు ఖర్చు రెట్టింపవుతోంది..

కొడవలూరి రామకృష్ణ, కృష్ణవేణి దంపతులు, గణపవరం.

7 నుంచి 8 రోజులపాటు పర్యటన



మహా కుంభమేళా యాత్రకు బస్సులో 7 నుంచి 8 రోజుల పాటు పర్యటన కొనసాగుతుంది. కుంభ మేళాలో పుణ్యస్నానాలు చేసిన తరువాత అయోధ్య, నైమిశారణ్యం, కాశీ, బుద్ధగయ క్షేత్రాలు సందర్శిస్తున్నారు. ప్రయాగ్‌రాజ్ వెళ్తున్న భక్తులు అక్కడ నుంచి సుమారు 125 కిలోమీటర్లు దూరంలో ఉన్న అయోధ్య బాలరాముడిని సైతం దర్శించుకుంటు న్నారు. కుంభమేళాకు వెళ్ళేందుకు అధికంగా రైళ్ళలోనే తీసుకెళ్ళి పుణ్యస్నానాలు చేయించి పలు దేవాలయాలను సందర్శింప చేస్తున్నాం. మరికొందరు బస్సులు బుక్ చేసుకుంటు న్నారు. అయితే రైళ్ళ ధరలు సామాన్యులకు అందు బాటులో ఉన్నాయి. స్లీపర్లు, సిట్టింగుతో కూడిన బస్సులకు డిమాండ్ ఉంది. కుంభమేళాతో పాటు అయోధ్య, కాశీ, గచ, కుంభగయలాంటి పలు యాత్రలకు 8 నుంచి 9 రోజుల వరకు పడుతోంది.

- కొలనువాడు సుబ్బరాజు, ట్రావెల్స్ నిర్వాహకుడు, పిప్పర

పాఠశాలల్లో భాషోత్సవం



21 వరకు అన్ని స్కూళ్లల్లో నిర్వహణ

నిడమర్రు ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : అమ్మభాష , మాతృభాష .. మన తెలుగు భాష .. మంచి మాట ద్వారా ప్రపంచ విజేతగా మారగలమని అక్షరసత్యం. మన మాట్లాడే భాష మీద మనకు చక్కని పట్టు ఉంటేనే మనం ఎక్కడైనా ఏ పరిస్థితులలోనైనా నిలబడగలం. వాక్చాతుర్యమే మనిషికి మంచి ఆభరణం. పిల్లల్లో భాషా సామర్థ్యాల పెంపు కోసం విద్యాశాఖ భాషోత్సవం నిర్వహిస్తోంది. భాషోత్సవాల ద్వారా పిల్లల్లో చదివే అలవాటు పెంచడం కోసం ఈ కార్యక్రమం ప్రత్యేకంగా నిర్వహిస్తున్నారు. పాఠశాల స్థాయి నుంచే పుస్తక పఠనం పెంచడం కోసం పాఠశాలల్లో గ్రంథాలయాల నిర్వహణ చేపడుతున్నారు. విద్యార్థుల్లో కమ్యూనికేషన్ స్కిల్స్ పెంచడం, చక్కటి సంభాషణ, సమాజ భాగస్వామ్యం, తల్లిదండ్రుల భాగస్వామ్యం పెంపొందిచడం భాషోత్సవాల ప్రధాన ఉద్దేశం.. ఉత్సవాల్లో భాగంగా ఫిబ్రవరి 18న ఇంగ్లీషు లాంగ్వేజ్ 19, సంస్కృతం, హిందీ, ఉర్దూ 20, గిరిజన భాషలు, కన్నడ, తమిళ, ఒరియా 21న తెలుగు భాషకు సంబంధించిన కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

ఇవీ చేపట్టనున్న కార్యక్రమాలు

విద్యార్థులకు స్టోరీ రీడింగ్ , కథలు రాయడం, చెప్పడం అభినయ గేయాలు, పద్యాలు చెప్పించడం, స్పెల్‌బీ నిర్వహణ , బోధనాపకరణాల ప్రదర్శన, లఘునాటికలు పాటలు , శ్లోకాలు వల్లె వేయడం , వ్యాసరచన, వక్తృత్వ పోటీల నిర్వహణ వంటి కార్యక్రమాలు చేపడుతున్నారు.

- **ప్రతి పాఠశాలలో నిర్వహించాలి**



ఈనెల 18 నుంచి 21 వరకు జిల్లాలోని అన్ని ప్రాథమిక, ప్రాథమి కోన్నత, ఉన్నత పాఠశాలల్లో భాషోత్సవాలు నిర్వహించాలని ఉత్తర్వులు ఇచ్చాం. విద్యార్థులు చదవడం, రాయడం, మాట్లాడటం ద్వారా అభ్యసన సామర్థ్యాలు పెంపొందుతాయి. పాఠశాల స్థాయిలో పోటీలు నిర్వహించి విద్యార్థులకు బహుమతులు అందజేస్తారు. దీని కోసం నిధులు కూడా పంపిణీ చేశాం. భాషోత్సవాల కార్యక్రమం ప్రతి పాఠశాలలో తప్పనిసరిగా నిర్వహించాలి.

-ఎం.వెంకటలక్ష్మమ్మ జిల్లా విద్యాశాఖాధికారి, ఏలూరు

బీఈడీకి మళ్లీ క్రేజ్..



మెగా డీఎస్సీతో కోర్సు పట్ల ఆసక్తి

మొన్నటివరకు పూర్తిస్థాయిలో సీట్లు భర్తీలేక డీలాపడిన బీఈడీ కాలేజీలు ఈ ఏడాది పుంజు కుంటున్నాయి. బీఈడీ కళాశాలల అడ్మిషన్లలో సీట్ల భర్తీ పెరిగింది. దీంతో ఆయా కళాశాలకు పూర్వ వైభవం వస్తుందా అనిపిస్తుంది. ఉమ్మడి జిల్లాల్లో 13 బీఈడీ కళాశాలలు ఉన్నాయి. వాటిలో మేనేజ్ మెంట్ కన్వీనర్ కోటా సీట్లు 800 వరకు ఉన్నాయి. వీటిలో 2024-26 విద్యా సంవత్సరం సీట్ల భర్తీ 80 శాతం పైగా అయ్యాయి. కొన్ని కళాశాలల్లో 90 శాతం వరకు సీట్లు భర్తీ చేసుకున్నాయి. దీనిని బట్టి చూస్తే బీఈడీ కోర్సు మీద విద్యార్థులు ఆసక్తి చూపిస్తున్నట్లే కనిపిస్తున్నది..

ఈ విద్యా సంవత్సరం అడ్మిషన్‌లలో పెరిగిన సీట్ల భర్తీ

ఉమ్మడి జిల్లాలోని 13 కళాశాలల్లో 80 శాతం పైగా సీట్లు పూర్తి..

భీమవరం రూరల్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): గడిచిన కొన్ని సంవత్సరాలుగా బీఈడీ కోర్సు పూర్తి చేసేవారి సంఖ్య తగ్గిపోతూ వస్తుండటంతో కళాశాల యాజమాన్యాలలో నిరుత్సాహం నెలకొంది. దీంతో గడిచిన కొన్నేళ్ళలో ఉమ్మడి జిల్లాలో నాలుగు బీఈడీ కళాశాలలు మూతపడ్డాయి. సీట్లు సగం పైగా తగ్గిపోయాయి. గతంలో ఒక్కో కళాశాలలో 120 నుంచి 160 సీట్లు వరకు ఉండేవి. ఇప్పుడు 70 శాతం పైగా కళాశాలల్లో 50 సీట్లతో 30 శాతం కళాశాలల్లో 100 సీట్లతో కళాశాలలు నడుస్తున్నాయి.



మెగా డీఎస్సీతో ఆసక్తి

కూటమి ప్రభుత్వం మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయనుంది. ఉమ్మడి జిల్లాల్లో మెగా డీఎస్సీ రిక్రూట్‌మెంట్‌గా 1035 ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయనున్నది. దీంతో బీఈడీ కోర్సు పట్ల మళ్లీ విద్యార్థులకు ఆసక్తి పెరిగింది. ప్రభుత్వ ఉంద్యోగాలు సాధించడానికి బీఈడీ కోర్సు ఒక ఆయుధం కావడంతో ఈ కోర్సుకు గిరాకీ పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి.

ఏడేళ్లుగా నోటిఫికేషన్ లేదు

ఇరవై ఏళ్ళ క్రితం బీఈడీ కోర్సు అంటే పోటీపడి మరీ చదివేవారు. మేనేజ్‌మెంట్ కోటా సీట్లు అప్పటి రోజుల్లో రూ.70 వేల నుంచి లక్ష వరకు చెల్లించి చదివేవారు. వేరే జిల్లాలకు వెళ్ళి కోర్సు పూర్తి చేసేవారు. ఆ సమయంలో డీఎస్సీ నోటిఫికేషన్లు రెండేళ్లకు ఒకసారైనా తీసేవారు. రానురాను టీచర్ ఉద్యోగాల భర్తీ తగ్గిపోయాయి. 2018లో టీడీపీ ప్రభుత్వం హయాంలో ఆఖరి డీఎస్సీ జరిగింది. గత ప్రభుత్వం హయాంలో డీఎస్సీ మాటే లేకుండాపోయింది. దీంతో బీఈడీ చదవడం నిరుపయోగం అనే లెక్కలోకి విద్యార్థులు వచ్చేశారు.

ఇబ్బందిగా రెండేళ్ల కోర్సు

బీఈడీ కోర్సు 2015 వరకు ఒక సంవత్సరం కోర్సుగా సాగింది. 2018 సంవత్సరం నుంచి రెండేళ్ల కోర్సుగా నిర్ణయించారు. దీంతో విద్యార్థులలో కొంచెం వెనుకబాటు ఏర్పడింది. దానికి తోడు డీఎస్సీ తీయకపోవడం కోర్సుపై మక్కువ తగ్గడానికి దారితీసింది. అందువల్ల బీఈడీ రెండేళ్ల కోర్సును గతంలో మాదిరిగా ఒక సంవత్సరం కోర్సుగా మార్చాలని నిపుణులు చెబుతున్నారు. అలా చేయడం వల్ల బీఈడీ కోర్సుకు పూర్వ వైభవం వస్తుందని అంటున్నారు.

సిలబస్‌లో మార్పులు అవసరం

ప్రస్తుతం విద్యాబోధనలో డిజిటల్ విధానం పెరిగిపోయింది. విద్యార్థులలో మేధాశక్తి బాగా పెరిగింది. ఐఐటీ, సిబీఎస్ఈ సిలబస్‌లు పాఠశాలలోనే వచ్చేశాయి. అందువల్ల బీఈడీ సిలబస్‌లో మార్పు తీసుకురావలసిన అవసరం ఉందని రిటైర్డ్ ఉపాధ్యాయులు, ప్రొఫెసర్‌లు సూచిస్తున్నారు. 20 ఏళ్లపై నుంచి ఉన్న సిలబస్‌నే నడుపుతున్నారు. ఒక ఏడాది కోర్సును రెండేళ్ల కోర్సుగా చేసినా పాత సిలబస్‌నే సెమిస్టర్లు పెంచి పార్ట్‌లుగా విభజించారు. ఇప్పుడున్న విద్యా విధానం తగ్గట్లుగా సిలబస్‌లో మార్పులు తీసుకురావాలని పలువురు విద్యావేత్తలు కోరుతున్నారు.

- **ఈ ఏడాది సీట్ల భర్తీ పెరిగింది**



గతంతో పోలిస్తే బీఈడీ కళాశాలలో సీట్ల భర్తీ ఈ విద్యా సంవత్సరంలో పెరిగింది. అయితే సిలబస్‌లో మార్పు తీసుకువస్తే బాగుంటుంది. ఇప్పుడున్న తరం పిల్లలకు బోధించాలంటే బీఈడీ కోర్సు చేసే విద్యార్థులకు కోర్సులో మార్పు ఉండాలి. గతంలోకి ఇప్పటికి చదువులో, టెక్నాలజీ, విద్యా విధానంలో అనేక మార్పులు వచ్చాయి.

- ధనలక్ష్మి , జీటీబీ బీఈడీ కళాశాల ప్రిన్సిపాల్, భీమవరం

నన్నయ ఉపకులపతిగా ప్రసన్నశ్రీ



దివాన్‌చెరువు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం నూతన ఉపకులపతిగా ఆచార్య సత్తుపాటి ప్రసన్నశ్రీ నియమితులయ్యారు. ఈమె ప్రస్తుతం ఆంధ్రా విశ్వవిద్యాలయం ఆంగ్ల విభాగ ఆచార్యులుగా విధులు నిర్వర్తిస్తున్నారు. అంతరించి పోతున్న గిరిజన భాషలను కాపాడుకునేందుకు విశేష కృషి చేసి 19 గిరిజన భాషలకు లిపి రూపొందించిన తొలి మహిళామూర్తిగా ప్రసన్న నిలిచారు. 2022వ సంవత్సరం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా అప్పటి రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ చేతుల మీదుగా నారీశక్తి పురస్కారాన్ని అందుకున్నారు. 38 సంవత్సరాల బోధనా అనుభవంలో ఎన్నో భాషా, సాహిత్య సంస్కరణలకు కృషి చేశారు. అనేక పరిశోధనా వ్యాసాలు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రచురితమయ్యాయి. ఆమె చేసిన సేవలకు గుర్తింపుగా అనేక అవార్డులు అందుకున్నారు. నిత్యం భాషా, సాహిత్య అభివృద్ధికి కృషి చేస్తున్న ప్రసన్నశ్రీ ప్రస్తుతం నన్నయ విశ్వవిద్యాలయం వీసీగా నియమితులయ్యారు. ప్రస్తుతం ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఇన్‌ఛార్జి వీసీగా ఆచార్య వై.శ్రీనివాసరావు ఏడు నెలలుగా కొనసాగుతున్నారు. ఆయన నన్నయ విశ్వవిద్యాలయంలో భూగర్భశాస్త్ర విభాగంలో ఆచార్యులుగా పనిచేస్తూ గత ఏడాది జూలై 18న నన్నయ ఇన్‌ఛార్జి వీసీ బాధ్యతలు చేపట్టారు.

జేఎన్టీయూకే ఉపకులపతిగా సీఎస్ఆర్కే ప్రసాద్



జేఎన్టీయూకే, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జేఎన్టీయూకే నూతన ఉపకులపతిగా ప్రొఫెసర్ చేకూరి శివరామకృష్ణ ప్రసాద్ నియామకమయ్యారు. ప్రొఫెసర్ ప్రసాద్‌ను వీసీగా నియమిస్తూ మంగళవారం రాష్ట్ర ఉన్నత విద్యా శాఖ కార్యదర్శి కోన శశిధర్ ఉత్తర్వులు జారీ చేసినట్లు ఇన్‌చార్జి రిజిస్ట్రార్ వి.రవీంద్రనాద్ తెలిపారు. ప్రసాద్ ప్రస్తుతం తెలంగాణలో గల వరంగల్ నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (నిట్)లో సివిల్ ఇంజనీరింగ్, ఎంటెక్ ట్రాన్స్‌పోర్టేషన్ విభాగంలో ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఆయన 3 ఏళ్ల పాటు జేఎన్టీయూకే ఉపకులపతిగా కొనసాగుతారు. గుంటూరు జిల్లాకు చెందిన సీఎస్ఆర్కే ప్రసాద్ తల్లిదండ్రులు సాంబశివరావు, వెంకటసుబ్బమ్మ. ఆయన గుంటూరు జిల్లా అమర్తలూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి, తెనాలిలోని వీఎస్ఆర్, ఎన్వీఆర్ కళాశాల్లో ఇంటర్ ఎంపీసీ, వరంగల్‌లోని రీజినల్ ఇంజనీరింగ్ కళాశాల(ప్రస్తుత ఎన్ఐటీ వరంగల్)లో బీటెక్, ఎంటెక్, పీహెచ్‌డీ పూర్తి చేశారు.

ఫారెస్టు సెక్షన్ ఆఫీసర్‌పై విచారణ



నిడమర్రు పంచాయతీ కార్యాలయంలో విచారణ జరుపుతున్న ఏలూరు రేంజ్ అధికారి విజయలక్ష్మి

నిడమర్రు ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): కొల్లేరు కాంటూరు జిరాయితీ భూముల్లో సాంప్రదాయ సాగు చేయడానికి రూ.40 వేలు లంచం తీసుకొన్న ఫారెస్టు సెక్షన్ ఆఫీసర్ నబగిరి శ్రీనివాసబాబుపై రైతుల ఫిర్యాదు మేరకు ఆంధ్రజ్యోతి పత్రికలో వచ్చిన కథనంపై ఏలూరు డిస్ట్రిక్ట్ ఫారెస్టు ఆఫీసర్ (వైల్డ్ లైఫ్) బి.విజయ విచారణకు ఆదేశించారు. ఈ వ్యవహారంపై విచారణ అధికారిగా ఏలూరు రేంజ్ ఆఫీసర్ పి.మోహినీ విజయ లక్ష్మిని నియమించారు. ఈ నెల 15వ తేదీన విచారణ అధికారి విజయలక్ష్మి రైతులకు ఫోన్ చేసి ఏలూరులో ఆఫీసుకు విచారణ నిమిత్తం హాజరుకావాలని కబురు పంపగా రైతులు విచారణకు హాజరు కాలేదు. దీంతో మంగళవారం విచారణ అధికారి విజయలక్ష్మి తన సిబ్బందితో వచ్చి నిడమర్రు పంచాయతీ కార్యాలయంలో విచారణ నిర్వహించారు. ఉదయం 11 గంటలకు విచారణ ప్రారంభమవ్వగా ప్రధాన ఆరోపణలు చేసిన నిడమర్రు రైతు మండా పోలయ్య విచారణకు హాజరయ్యారు. రైతు పోలయ్య మాట్లాడుతూ తన ఇంటికి వచ్చి సెక్షన్ ఆఫీసర్ శ్రీనివాసబాబు రూ.30 వేలు తీసుకొని వెళ్లాడని, అలాగే రూ.10 వేలు ఫోన్ పే కూడా చేయించుకొన్నాడని ఆరోపించారు. విచారణలో పేర్కొన్న చెట్టున్నపాడు భూముల వ్యవహారానికి తమ నిడమర్రు జిరాయితీ భూములకు సంబంధం లేదన్నారు. తమకు గల సుమారు 5 ఎకరాల భూమిసాగు నిమిత్తం సాంప్రదాయ సాగు చేయడానికి లంచం డిమాండ్ చేయడం జరిగిందన్నారు. మరో రైతు విచారణకు హాజరుకాలేదు. ఈ విచారణ లో ఫారెస్టు అధికారులు గంగారత్నం, ఈశ్వరరావు, సుజాత, ధనలక్ష్మీ, పంచాయతీ కార్యదర్శి సంజీవరావు, వీఆర్వో నాగయ్య పాల్గొన్నారు.

వివాహేతర సంబంధమే కారణమా?

పోలీసుల విచారణ వేగవంతం..కొలిక్కి వస్తున్న హత్య కేసు



హతుడు మజ్జి ఏసు

నిడమర్రు ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): అనుమానమే పెనుభూతంగా మారి ఘోర హత్యకు దారితీసింది. తాను ప్రేమించి పెళ్లి చేసుకొన్న భార్యపై పక్కింటోడు వ్యామోహం పడ్డాడనే అనుమానం ఆ నిందితుడిని రగిలించి వేసింది. హత్య కు గురైన వ్యక్తి గతంలో కొంత మంది మహిళలతో వివాహేతర సంబంధాలు నడిపే వాడని సమాచారం. ఈనెల 15వ తేదీన బావాయిపాలెంనకు చెందిన మజ్జి ఏసు హత్యకు గురైన సంగతి తెలిసిందే. ఇతడిని ముగ్గురు కలిసి హత్య చేసినట్టుగా అను మానిస్తున్నారు.

మజ్జి ఏసు హత్య జరిగిన రోజు పోలీసు జాగిలాలు గుర్తించిన పక్కింటి తండ్రి, కొడుకులైన పిల్లి ఏసు, పిల్లి అన్నవరంలను పోలీసులు అనుమానిస్తున్నారు. వీరి సెల్‌ఫోన్‌లు స్విచ్‌ఆఫ్ అవ్వడంతో వారి ఆచూకి కోసం గాలిస్తున్నారు. ప్రాథమిక సమాచారం ప్రకారం నిందితులకు ఉండి మండలం మహదేవపట్నంకు చెందిన మరో వ్యక్తి సహకరించాడని సమాచారం. నిందితుడు పిల్లి ఏసు భార్య పురుడు కోసం పుట్టింటికి మూడు నెలల క్రితం వెళ్లగా మజ్జి ఏసు కూడా అక్కడకు వెళ్లడం వల్ల భర్త ఏసురాజు మరింత కోపోద్రిక్తుడయ్యాడు. హత్య నేపథ్యం పరిశీలిస్తే గ్రామస్థుల సమాచారం ప్రకారం గతంలో ఇరుకుటుంబాల మధ్య ఈ వ్యవహారంలో గొడవలు కూడా జరిగా యని, పెద్ద మనుషులు ఎన్నో సార్లు హతుడి ప్రవర్తనను తప్పుపట్టి తీరు మార్చు కోవాలని హెచ్చరించారు. ఐనప్పటికీ హతుడు తీరు మార్చుకోలేదు.

హత్య జరిగిన తీరు ఇలా...

హత్య జరగడానికి రెండు రోజుల ముందు హతుడు మజ్జి ఏసు తన పక్కింటి మహిళ ఊరైన మహదేవపట్నం వెళ్లి రావడం జరిగిందని చెబుతున్నారు. హత్య జరిగిన రోజు అర్ధరాత్రి ఒక వ్యక్తి ద్వారా మజ్జి ఏసును బావాయిపాలెం వంతెన వద్దకు మద్యం తాగడానికి పిలిచినట్లు సమాచారం. హతుడు ఏసు, నిందితులుగా భావిస్తున్న పిల్లి ఏసు, అతని తండ్రి అన్నవరం, మరో వ్యక్తి కలిసి ఫుల్‌గా మద్యం తాగారు. తర్వాత ముందుగా వేసుకొన్న పథకం ప్రకారం కల్లుగీసే కత్తితో మజ్జిఏసు కుడిచేతిని పిల్లి ఏసురాజు తండ్రి బలంగా ఒక్క వేటుతో నరికే సినట్లు తెలుస్తోంది. తీవ్ర రక్తస్రావం అవుతు ండగా ఆ తర్వాత పీకబిగించడంతో ఊపిరాడక చనిపోయినట్లు తెలుస్తోందని స్థానికులు అంచనా వేస్తున్నారు. టెక్నాలజీని ఉపయోగించి నిడమర్రు పోలీసులు విచారణ వేగవంతం చేస్తున్నారు. పోలీసు జాగిలాలు, క్లూస్‌టీంల పాత్ర వల్ల విచారణ వేగవంతమైంది. రెండు రోజుల్లో నిందితులను పట్టుకొంటామన్నారు.

ప్రేమ పేరుతో వేధింపులు.. యువతి ఆత్మహత్య

నరసాపురం రూరల్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొప్పర్రు గ్రామానికి చెందిన యువతి సోమవారం రాత్రి ఫ్యాన్‌కి ఉరివేసుకుని మృతి చెందినట్లు రూరల్ ఇన్‌చార్జి ఎస్సై నాగలక్ష్మి తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన వై.సిరి ఇంటర్ చదివి ఇంటి వద్దే ఉంటుంది. ఇదే గ్రామానికి చెందిన యు సాలోమోను కొద్దికాలంగా ప్రేమ పేరుతో అసభ్యంగా ప్రవర్తించాడన్నారు. ఈ నెల 17న సిరి ఇంటికి సాలోమోను భార్య, చెల్లి వచ్చి దుర్భాషలాడారన్నారు. దీంతో సిరి తీవ్ర మనస్తాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడిందన్నారు. వెంటనే ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు చెప్పారన్నారు. ఈ మేరకు సోదరుడు చందు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నాగలక్ష్మి చెప్పారు. మంగళవారం మృతదేహాన్ని పోస్టుమార్టం జరిపి ఆమె కుటుంబ సభ్యులకు అప్పగించామన్నారు.

రెండు బ్యారెన్ షెడ్‌లు దగ్ధం

కామవరపుకోట, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): రావికంపాడు పంచాయతీలోని రెడ్డిగూడెంలో మానికల శ్రీను, సత్యనారాయణలకు చెందిన రెండు బ్యారెన్‌లలో పొగాకు క్యూరింగ్ చేసే సమయంలో బ్యారెన్‌లలో మంటలు వ్యాపించాయి. లోపల ఉన్న పొగాకు పూర్తిగా దగ్ధమైంది. రైతులు అగ్నిమాపక అధికారులకు సమాచారం అందించగా వారు వచ్చి మంటలను అదుపు చేశారు. ఇద్దరు రైతులకు సుమారు రూ.15 లక్షలు నష్టం వాటిల్లినట్టు వారు పేర్కొన్నారు.

ఏలూరు కలెక్టరేట్‌లో పోస్టల్ బ్యాలెట్ కేంద్రం



కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన పోస్టల్ బ్యాలెట్ కేంద్రం

ఏలూరు, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్‌కు అవకాశం కల్పించడంతో, వారికి ఏలూరు కలెక్టరేట్‌లో పోస్టల్ బ్యాలెట్ జారీ చేసే కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి తెలిపారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బంది ఫారం-12ను జిల్లా ఎన్నికల రిటర్నింగ్ అధికారికి ఈ నెల 20వ తేదీ సాయంత్రం 5 గంటల్లోగా సమర్పించాలన్నారు. సిబ్బంది ఈ ఫారాలను ఏలూరు.ఏపీ.జీవో.ఇన్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. ఫారంతో పాటు డ్యూటీ కేటాయింపు చేసిన ఉత్తర్వులు ప్రతిని జతపర్చాల్సిందిగా కోరారు.

ఓటు వినియోగానికి ప్రత్యేక క్యాజువల్ లీవ్

ఈ నెల 27న జరిగే ఎమ్మెల్సీ పోలింగ్‌కు ఓటర్లుగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగులకు స్పెషల్ క్యాజువల్ లీవ్ ఇవ్వాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వివేక్‌యాదవ్ ఆదేశాలు జారీ చేశారని ఎమ్మెల్సీ ఎన్నికల రిటర్నింగ్ అధికారి కె.వెట్రిసెల్వి తెలిపారు. దీనికి సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రైవేట్ సంస్థలు, యాజమాన్యాలు వారి వద్ద పనిచేసే ఉద్యోగులు ఓటు హక్కు వినియోగించేందుకు సర్ధుబాటు చేసుకోవాలని సూచించారు.

ఫ్లయింగ్ స్క్వాడ్‌ల ఏర్పాటు

తూర్పు,పశ్చిమగోదావరి జిల్లా పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా, స్వేచ్ఛాయుతంగా జరిగేలా చర్యలు తీసుకోవడానికి ప్రత్యేక ఫ్లయింగ్ స్క్వాడ్‌లను, స్టాటిక్ సర్వేలైన్స్ టీమ్‌లు, జోనల్ ఆఫీసర్లను ఎన్నికల రిటర్నింగ్ అధికారి కె.వెట్రిసెల్వి నియమించారు. మండల స్థాయిలో ఎన్నికల నిర్వహణకు ఈ బృందాలు పర్యవేక్షిస్తాయి. ఈ బృందాల్లో నియమించబడిన అధికారులు ప్రత్యేక ఎగ్జిక్యూటివ్ మేజి స్ట్రేట్‌లుగా పేర్కొంటూ ప్రభుత్వ కార్య దర్శి, లీగల్, లెజిస్లేటివ్ ఎఫైర్స్ జస్టిస్, లా డిపార్టుమెంట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ పరిధిలో 21 ఎఫ్ఎస్‌టీ టీమ్‌లు, 10 మంది జోనల్ అధికారులను నియమించారు.

ప్రచారంలో కూటమిదే హవా

భీమవరం టౌన్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): ఉభయగోదావరి జిల్లా పట్టభద్రుల నియోజకవర్గ ఎన్నికలకు కౌంట్‌డౌన్ ప్రారంభమైంది ఈనెల 27న జరిగే ఎన్నికల్లో పోలింగ్ కోసం కేంద్రాలను ఖరారు చేశారు. మరో వైపు బరిలో నిలచిన అభ్యర్థులు ప్రచారాన్ని మమమ్మరం చేశారు. పట్టభద్రులను, ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగులను కలుసుకుంటున్నారు. మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరుతున్నారు. ఇప్పటి దాకా ప్రచారంలో తెలుగుదేశం కూటమిదేపై చెయ్యిగా నిలిచింది. కూటమి నాయకులు నియోజకవర్గాలల్లో సుడిగాలి పర్యటన చేస్తున్నారు. ఓటరను కలుసుకుంటున్నారు. జిల్లా మొత్తం మీద 70052 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఇందులో పురుషులు 39863 మంది, మహిళలు 30187, ట్రాన్స్‌జెండర్ ఇద్దరు ఉన్నారు.

గొల్లలకోడేరులో ఆక్రమణల తొలగింపు

అరటి, కొబ్బరి తోటల ధ్వంసం



తొలగించిన చెట్లను ట్రాక్టర్లలో తీసుకెళుతున్న దృశ్యం

పాలకోడేరు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): గొల్లలకోడేరులో డ్రెయినేజీ, ఇరిగేషన్ స్థలం సుమారు 3 ఎకరాల్లో వేసిన అరటి, కొబ్బరి తోటను అధికారుల పర్యవేక్షణలో మంగళవారం స్వాధీనం చేసుకున్నారు. వివరాల్లోకి వెళితే.. గొల్లలకోడేరు గ్రామం తాడేపల్లిగూడెం రహదారి వైపు వెళ్ళే ప్రాంతంలో సర్వే నెంబర్ 313-2ఏ1లో ఎకరం 85 సెంట్ల భూమిని లీజుకు తీసుకున్నారు. దాంతోపాటు యనమదుర్రు డ్రెయిన్ గట్టుకు చేర్చి డ్రెయినేజీకి సంబంధించిన భూమి సాగు చేసుకుంటూ వస్తున్నారు. ఇలా 1979-82 మధ్య కాలంలో మూడు సంవత్సరాల పాటు కూరగాయల పంట వేసుకునే విధంగా గ్రామానికి చెందిన ఒక రైతు ప్రభుత్వం వద్ద సుమారు 155 రూపాయలకు లీజుకు తీసుకున్నారు. ఆ భూమికి చేర్చి డ్రెయినేజీ పోరంబోకుకు చెందిన 1982-1985 సంవత్సరాల్లో మరో మూడు సంవత్సరాలు, ఇలా 1987 డిసెంబర్ వరకు లీజును తీసుకుంటూ వస్తున్నారు. 1988 సంవత్సరంలో ప్రభుత్వం ఇటువంటి లీజులు ఏమున్నా వాటిని రద్దుపరిచే విధంగా ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చింది. దీంతో ఆనాటి నుంచి ఆ తోట ఆ రైతు స్వాధీనంలోనే ఉంది. సంబంధిత రైతు ఆ తోటను తనకు అప్పగించాలంటూ అధికారులను వేడుకున్నారు. ప్రైవేట్ రేటు ఎలా ఉంటే ఆ భూమిని ఆ రేటుకు కొనుగోలు చేసుకుంటానని తనకు ప్రభుత్వం నుంచి ఆదేశాలు ఇవ్వాలంటూ అధికారులకు విన్నవించుకున్నారు. అయితే అప్పటి కలెక్టర్ చీఫ్ కమిషనర్ ఆఫ్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ (సిసిఎల్ఏ) వారికి ఆ రైతు చేసుకున్న విజ్ఞప్తిని పరిశీలించమని కోరారు. అయితే ఇరిగేషన్, డ్రెయినేజీ శాఖలకు చెందిన ఆ భూమి వరదల సమయాల్లో ఉపయోగించుకునేందుకు ఎంతగానో ఉపయోగపడుతుందని, అటువంటి భూమిని ఎవరికీ ఇచ్చేది లేదంటూ సీసీఎల్ఏ అధికారులు రిజెక్ట్ చేశారు. ఆనాటి నుంచి సంబంధిత రైతు కోర్టును ఆశ్రయిస్తూ ఆ భూమిని తనకు అప్పగించాలని కోరుతూ వస్తున్నారు. ఇదిలా ఉండగా ఆ భూమి ప్రభుత్వ అవసరాలకు అవసరమని రెవెన్యూ, ఇరిగేషన్, డ్రెయినేజీ, పంచాయతీ, పోలీసు, వైద్య సిబ్బంది, ఇతర శాఖల సమన్వయంతో మంగళవారం తెల్లవారుజాము నుంచే ఆ అరటితోటను ఎక్స్‌కవేటర్లతో తొలగించి ట్రాక్టర్ల ద్వారా ఆ తోటను శుభ్రపరిచారు. అంతే కాకుండా ఈ తోట ప్రభుత్వపరమైందని ఇరిగేషన్ అధికారులు సంబంధిత హెచ్చరిక బోర్డులను కూడా ఏర్పాటు చేశారు.

పాలకోడేరులో ఆక్రమణల తొలగింపునకు చర్యలు

పాలకోడేరు గ్రామ శివారులోని రాశి కాలువ గట్టును చేర్చి ఉన్న ఆక్రమిత గృహాలను ఇరిగేషన్, పంచాయతీ అధికారులు తొలగించేందుకు మంగళవారం రంగం సిద్ధం చేశారు. దీనిలో భాగంగా ముందుగానే కొంత మంది స్థలాలు పొంది గృహాలు నిర్మించుకున్నవారిని ఆ ప్రాంతంలో ఖాళీ చేయాలంటూ అధికారులు హుకుం జారీ చేశారు. దీనిలో భాగంగా సంబంధిత గృహ యజమానులు మంగళవారం గృహాలను తొలగించుకుని వేరే ప్రాంతాలకు వెళ్ళిపోయారు. అయితే మిగిలిన వారు తమకు గడువు ఇవ్వాలంటూ అధికారులను వేడుకోవడంతో అధికారులు కొంత సమయం ఇచ్చారు. దీంతో వివాదం సద్దుమణిగింది.

పోలసానపల్లిలో కాశీబొట్ల అంత్యక్రియలు



కాశీబొట్లకు నివాళులు అర్పిస్తున్న గ్రామస్థులు, ప్రముఖులు

భీమడోలు, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి) : ద్వారకాతిరుమల వేంకటేశ్వరస్వామి పంచాగకర్త ఆ స్థాన సిద్ధాంతి కాశీబొట్ల వీర వెంకట నాగేశ్వరకృష్ణ ప్రసాద్ శాస్త్రి అంత్యక్రియలు పోలసానపల్లిలో నిర్వహించారు. అంత్య క్రియలకు భారీగా జనం తరలివచ్చారు. రాజమండ్రి, విశాఖపట్నం, ఉమ్మడి జిల్లాల నలుమూలల నుంచి బ్రాహ్మణ సంఘాల ప్రముఖులతో పాటు రాజకీయ నాయకులు, సంఘసంస్కర్తలు, సేవా సంస్థల ప్రతినిధులు కాశీబొట్ల మృతికి నివాళులర్పించేందుకు ఆయన గృహానికి తరలి వచ్చారు. ఏలూరు జిల్లా టీడీపీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే గన్ని వీరాంజనేయులతో పాటు శ్రీనివాసరాజు, గ్రామ సర్పంచ్ షేక్ రహీమాబేగమ్, తదితరులు ఆయన మృతికి సంతాపం ప్రకటించారు.

పెచ్చుమీరుతున్న చిల్లర దొంగలు

ఐదు షాపుల్లో చోరీలు



ఏలూరు క్రైం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : ఏలూరు నగరంలో చిల్లర దొంగలు రోజురోజుకూ పెచ్చుమీరిపోతున్నారు. రాత్రి వేళ పోలీస్ గస్తీ అంతంత మాత్రమే ఉండడంతో దొంగలు హల్‌చల్ చేస్తున్నారు. ఈనెల 17వ తేదీ రాత్రి శనివారపుపేట గాలిగోపురం సమీపంలోని షాపు నిర్వాహకులు తమ షాపులకు తాళాలు వేసి ఇళ్లకు వెళ్ళిపోయారు. మంగళవారం ఉదయం ఆషాపు షెల్టర్లు పగులగొట్టి ఉన్నాయి. ఐదు షాపుల్లో నేరాలు జరిగాయి. షాపులోని వస్తువులు, ల్యాప్‌టాప్, సెల్‌ఫోన్, నగదు అపహరించుకుపోయినట్టుగా గుర్తించారు. ఈ సంఘటనపై త్రి టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సంఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించారు. సీసీ కెమెరాలు పరిశీలించగా యువకులే ఈ నేరాలకు పాల్పడినట్లుగా గుర్తించారు. ముఖ్యంగా ఏలూరు శనివారపుపేట రోడ్డు అమీనాపేట లో బ్రిడ్జి దగ్గర నుంచి శనివారపుపేట వరకూ మెయిన్‌రోడ్డుపై ఉన్న షాపులే దొంగలు టార్గెట్ చేసుకున్నారు. గతంలో అనేక సార్లు ఈ షాపులను బద్దలకొట్టి వస్తువులను, నగదును అపహరించుకుపోయారు. పోలీసులు ఈ కేసుల్లో పురోగతి సాధించలేదు. పల్సర్ బండిపై ముగ్గురు యువకులు మాస్క్ పెట్టుకుని ఈనేరానికి పాల్పడినట్లుగా గుర్తించారు. వారిని ఇంకా అరెస్టు చేయలేదు. ఇదిలా ఉండగా మళ్ళీ చిల్లర దొంగలు, మెయిన్‌రోడ్డులోని షాపులనే టార్గెట్ చేసుకుని షట్టర్లను పగులగొట్టి చోరీలకు పాల్పడుతున్నారు. పోలీసులు, ఉన్నతాధికారులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

కూలీలపైకి దూసుకెళ్లిన ట్రాక్టర్

మహిళ మృతి.. ముగ్గురికి గాయాలు



కూలీలను ఢీకొట్టిన తర్వాత తిరగబడిన ట్రాక్టర్

కొయ్యలగూడెం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి):ఉపాధి పనులు చేసుకుంటున్న కూలీలపై ట్రాక్టర్ దూసుకెళ్ళింది. దీంతో ఒక మహిళ మృతి చెందగా మరో ముగ్గురికి గాయాలయ్యాయి. ఎస్సై చంద్రశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం కుంతలగూడెం గ్రామంలో ఉపాధి పనులు చేస్తుండగా రోడ్డుపై వెళ్తున్న ఒక ట్రాక్టర్ కూలీల మీదకు దూసుకెళ్ళింది. దీంతో ఆ గ్రామానికి చెందిన అల్లే భాగ్యవతి (54) మృతి చెందగా మరో ముగ్గురు కూలీలైన బాసుబోయిన పోసమ్మ, చాపల ఇమిలియ, రాపాక నాగమణికి తీవ్రగాయాలయ్యాయి. గాయాలైన ముగ్గుర్ని కొయ్యలగూడెం ఆసుపత్రికి తరలించారు. ట్రాక్టర్ అతివేగంగా వెళ్ళి కూలీలను ఢీకొట్టాడు. సంఘటనా స్థలానికి ఎస్సై చంద్రశేఖర్, ఇన్‌ఛార్జ్ ఎంపీడీవో శ్రీనివాసరావు, ఏపీవో నాగేశ్వరరావు వెళ్ళి పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వీడని మిస్టరీ

- 20 రోజుల క్రితం కొప్పర్రు కాల్వలో కొట్టుకొచ్చిన మృతదేహం
- హత్య చేయబడినట్టుగా పోలీసుల గుర్తింపు
- మిస్టరీ ఛేదించేందుకు రెండు పోలీసు బృందాల ఏర్పాటు

నరసాపురం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): నరసాపురం మండలం కొప్పర్రు గ్రామంలోని జిన్నూరు పంట కాల్వలో దాదాపు 20 రోజుల క్రితం కొట్టు కొచ్చిన వ్యక్తి మృతదేహం కేసులో ఇంకా మిస్టరీ వీడలేదు. కాల్వలో మృతదేహం తూడు కారణంగా నిలిచిపోయింది. గుర్తించిన గ్రామస్థులు పోలీసులకు సమాచారం అందించారు. తొలుత పోలీసులు ఆత్మ హత్య చేసుకొని ఉండవచ్చని భావించారు. మృతదేహన్ని బయటకు తీసిన తరువాత షాక్‌కు గురయ్యారు. కత్తితో పొడిచి, కాళ్లు కట్టేసి ఉండడాన్ని గుర్తించారు. హత్యచేసి అనుమానం రాకుండా పథకం ప్రకారం నీటిలో పడేసి ఉండవచ్చని భావించారు. మృతదేహం బాగా కుళ్లిపోయి ఉండటం, వంటిపై ఎటువంటి దుస్తులు లేకపోవడంతో ఎటువంటి ఆధారాలు చిక్కలేదు. సాధారణంగా గోదావరిలో ఎవ రైనా ఆత్మహత్య చేసుకున్నా, హత్యచేసి పడేసినా అటువంటి మృతదేహాలు శివారు ప్రాంతంలో ఉన్న నరసాపురం, మొగల్తూరు ప్రాంతాలకు కొట్టుకొస్తుంటాయి. గతంలో ఇలా ఎన్నో మృతదేహాలు వచ్చాయి. విజ్జేశ్వరం నుంచి మొగల్తూరు వరకు నిడదవోలు పంట కాల్వ సుమారు 70 కిలోమీటర్లు ఉంది. కాల్వలో గాని, గోదావరిలో గాని మృతదేహాలు కొట్టుకొచ్చినప్పుడు లాకుల వద్ద నిలిచిపోతాయి. ఇలాంటి సందర్భాలలో లాకు గేట్లు ఎత్తేసి కిందకు పంపేస్తుంటారు. ఇలా కొట్టుకొచ్చే మృతదేహాలు కొన్ని సమయాల్లో తూడు పడి నిలిచిపోతుంటాయి. లేకపోతే ఉప్పుటేరుగుండా సముద్రంలోకి కొట్టుకుపోతుంటాయి. కొన్ని సమయాల్లో నిలిచిపోయినప్పుడు ఏవరైనా ఫిర్యాదు చేస్తే పోలీసులు వాటిని వెలికి తీస్తుంటారు. అయితే కొప్పర్రు గ్రామంలో చిన్న పంట కాల్వలో రావడం పలు అనుమానాలకు తావిచ్చింది. ఎక్కడైనా హత్య చేసి, గుర్తుపట్టలేని స్థితికి వచ్చిన తరువాత తీసుకొచ్చి ఇక్కడ పడేశారా? లేక ఎగువ ప్రాంతం నుంచి కొట్టుకొచ్చిందా అన్నది మిస్టరీగా మారింది. పోలీసులు మాత్రం అన్ని పోలీసు స్టేషన్‌లకు సమాచారం అందించారు. కనిపించడంలేదన్న కేసు గత రెండు నెలలు నుంచి ఏ స్టేషన్‌లోనైనా నమోదైందా అన్న విషయాన్ని ఆరా తీస్తున్నారు. మిస్టరీ ఛేదించేందుకు రెండు పోలీసు బృందాలను ఏర్పాటు చేశారు.

కంప్యూటర్ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

ఉండి, ఫిబ్రవరి18 (ఆంధ్రజ్యోతి): కంప్యూటర్ కోర్సులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఉండి ఐటీఐ ప్రిన్సిపాల్ వేగేశ్న శ్రీనివాసరాజు తెలిపారు. ఏపీఎస్ఎస్‌డీసీ ఆధ్వర్యంలో కంప్యూటర్ కోర్సులకు తమ కళాశాలలో 45 రోజులపాటు కంప్యూటర్ శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. 10వ తరగతి ఆపై పాసైన విద్యార్థులు అర్హులని తెలిపారు. శిక్షణ ముగిసిన వారికి సర్టిఫికెట్స్ ఇవ్వడం జరుగుతుందన్నారు. తదుపరి మెరిట్ ఆధారంగా ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని ప్రిన్సిపాల్ వివరించారు. ఆసక్తి ఉన్నవారు ఈనెల 28వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని ఆయన తెలిపారు.

చెల్లని చెక్కు కేసులో ఒకరికి జైలు

నూజివీడు టౌన్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి):చెల్లనిచెక్కు కేసులో ఒకరికి ఆరు నెలలు జైలుశిక్ష, జరిమానా విధిస్తూ నూజివీడు స్పెషల్ మేజిస్ట్రేట్ వేల్పుల కృష్ణమూర్తి మంగ ళవారం తీర్పు చెప్పారు. వివరాల్లోకి వెళితే.. జంగారెడ్డిగూడెంకు చెందిన కర్రా ఎర్నెస్ట్ కుమార్‌కు గొల్లపల్లికి చెందిన మల్లవల్లి ప్రవీణ్ కుమార్ రూ.10లక్షల నగదును అప్పుగా ఇచ్చా డు. కొంతకాలం తరువాత బాకీ తీర్మానం నిమిత్తం ఎర్నెస్ట్ కుమార్ డిసెంబర్ 20, 20 20లో రెండు చెక్కులను ఇవ్వగా, ఆ చెక్కులు బౌన్స్ అయ్యాయి. దీంతో బాధితుడు ప్రవీణ్ కుమార్ నూజివీడు కోర్టును ఆశ్రయించగా, నూజివీడు స్పెషల్ మేజిస్ట్రేట్ కేసు విచారించి నిందితుడు కుమార్‌కు ఆరు నెలలు జైలుశిక్ష, రూ.12 లక్షలు జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.

యువకుడికి ఎనిమిదేళ్ల జైలు

ఇరగవరం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : ఇరగవరం గ్రామానికి చెందిన తోట నరేశ్‌కు ఎనిమిది సంవత్సరాలు జైలు శిక్ష విధిస్తూ మంగళవారం భీమవరం పోక్సో కోర్టు న్యాయమూర్తి బి. లక్ష్మీనారాయణ తీర్పును వెల్లడించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. 2022 జనవరి 27న ఇరగవరం మండలం గొల్లమాలపల్లి గ్రామానికి చెందిన తోట నరేశ్ ఒక బాలికను లైంగికంగా వేధిస్తూ అడ్డుపడిన వారిని చంపుతానని బెదిరిస్తున్నాడని బాలిక తల్లి దండ్రులు ఇరగవరం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అప్పటి ఎస్ఐ జానా సతీశ్ కేసు నమోదు చేసి నిందితుడిని కోర్టుకు తరలించారు. నేర నిర్ధారణ కావడంతో భీమవరం పోక్సో కోర్టు న్యాయమూర్తి వివిధ సెక్షన్ల కింద ఎనిమిది సంవత్సరాలు జైలు శిక్ష, రూ.60 వేలు జరిమానా విధించినట్లు ఎస్ఐ వివరించారు.

గుండెపోటుతో కూలీ మృతి

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : తమ్మిలేరు కాలువలోని గుర్రపుడెక్క తీస్తుండగా ప్రమాదవశాత్తు ఒక కూలీ గుండెపోటుకు గురై మరణించాడు. ఉంగ్రాజవరం మండలం వడ్డూరి గ్రామానికి చెందిన మల్లపు సూర్యారావు (55) అదే గ్రామానికి చెందిన 20 మంది వరకు కూలీలు ఏలూరులోని తమ్మిలేరు కాలువలో గుర్రపు డెక్క తొలగించడానికి మంగ ళవారం ఉదయం వచ్చారు. గుర్రపుడెక్కను తొలగిస్తున్న సమయంలో సూర్యారావు అకస్మాత్తుగా కుప్పకూలి గట్టు వద్ద పడిపోయాడు. అతనిని వెంటనే తోటి కూలీలు ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తీసుకురాగా ఆసుపత్రి వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందాడని నిర్ధారించారు. అతని మరణం అనుమా నాస్పదంగా భావించి ఆసుపత్రి వైద్యులు ఆసుపత్రి ఔట్‌పోస్టు పోలీసులకు సమాచారం ఇచ్చారు.

నవ వధువు అదృశ్యం

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): పెళ్ళయి 18 రోజులు అయిన నవవధువు అత్తింటి వద్ద నుంచి అర్ధరాత్రి తన ఒంటిపై ఉన్న నగలతో వెళ్ళిపోయింది. ఏలూరు తూర్పు వీధికి చెందిన వి శివనాగసాయి ఒక జ్యూస్ షాపు నిర్వహిస్తున్నాడు. అతనికి గత నెల 31వ తేదీన విశాఖపట్నంలోని కంచరపాలెంనకు చెందిన బోడోపు చంద్రహాసిని (21) అనే యువతితో వివాహం అయింది. వారం రోజుల క్రితం ఏలూరు నగరానికి ఆ కొత్త జంట వచ్చారు. ఒక అద్దె ఇంట్లో వారు కొత్త కాపురం పెట్టారు. ఈనెల 16వ తేదీ రాత్రి భార్యాభర్తలు ఇద్దరు యథావిధిగా నిద్రించారు. 17వ తేదీ ఉదయానికి శివ లేచి చూడగా అతని భార్య కనిపించలేదు. అప్పటి నుంచి వెతికినప్పటికి ఆమె ఆచూకీ కానరాలేదు. దీంతో మంగళవారం ఏలూరు వన్ టౌన్ పోలీసులకు శివ ఫిర్యాదు చేశారు. తన భార్య ఒంటిపై బంగారపు గొలుసు, ఉంగరం, వెండిపట్టీలు ఉన్నాయని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు

వివాదాలకు దూరంగా ఉండండి : పెదవేగి సీఐ

పెదవేగి, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి) : జాతర సమయంలో ఎలాంటి ఘర్షణలు జరగకుండా గ్రామస్థులు సంయమనంతో వ్యవహరించాలని పెదవేగి సీఐ కె.వెంకటేశ్వరరావు అన్నారు. పెదవేగి మండలం కూచింపూడిలో రెండు నెలలుగా జరుగుతున్న జాతర ముగింపు దశకు చేరుకున్న నేపథ్యంలో మంగళవారం సమావేశం ఏర్పాటు చేసి పలు సూచనలు చేశారు. వచ్చే ఆదివారం, సోమవారం రెండ్రోజులు గ్రామస్తులు మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వాహనాల కోసం ప్రత్యేకంగా పార్కింగ్ స్థలాలను ఎంపిక చేశామని, వాహనదారులు కేటాయించిన స్థలంలోనే వాహనాలు పార్కింగ్ చేసి, ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు సహకరించాలని సీఐ వెంకటేశ్వరరావు కోరారు. ఈ సమావేశంలో పెదవేగి ఎస్ఐ కె.రామకృష్ణ, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఆర్థోపెడిక్స్ విభాగానికి అచ్యుతరావు నియామకం

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : ఏలూరు ప్రభుత్వ మెడికల్ కళాశాలలోని ఆర్థోపెటిక్స్ విభాగానికి అసోసియేట్ ప్రొఫెసర్‌గా డాక్టర్ అమ్మ పోలు అచ్యుతరావును నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. డాక్టర్ అచ్యుతరావు ప్రస్తుతం విశాఖపట్నంలోని ఆంధ్రా మెడికల్ కాలేజీ (కింగ్‌జార్జి ఆసుపత్రి)లోని ఆర్థోపెడిక్స్ శాఖలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. ఆయనను ఏలూరులో ఉన్న ప్రభుత్వ మెడికల్ కళాశాలకు బదిలీ చేశారు.

ఆటపాటలతో అంగన్‌వాడీలు విద్యాబోధన చేయాలి

దెందులూరు, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి) : అంగన్వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు ఆట పాటలతో కూడిన విద్యను అందించేలా టీచర్లు బోధన చేయాలని ఏలూరు జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ పీడీ శారదా అన్నారు. మంగళవారం మండలంలోని దెందులూరు శ్రీగారపాటి హైమావతి దేవి జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో జ్ఞానజ్యోతి కార్యక్రమంలో భాగంగా మండలంలోని అన్ని అంగన్వాడీ కేంద్రాల టీచర్లు, మినీ కేంద్రాల టీచర్లకు విద్యా బోధనపై శిక్షణ తరగతులను పెదపాడు ప్రాజెక్టు సీడీపీవో విజయలక్ష్మి, సెక్టార్ సుపర్‌వైజర్లు చిట్టెమ్మ, శ్రీదేవి, పద్మభూషణం ఆధ్వర్యంలో నిర్వహించారు.

టీడీపీ జిల్లా మహిళా నాయకురాలు సుశీల మృతి

దెందులూరు, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశం పార్టీ జిల్లా మహిళా నాయకురాలు, దళిత సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు దెందులూరు మాజీ జడ్పీటీసీ పత్తిపాటి సుశీల(70) అనారోగ్యంతో కొవ్వలి గ్రామంలోని తన నివాసంలో మృతి చెందారు. సుశీల పార్థివ దేహాన్ని పలువురు ప్రముఖులు సందర్శించి నివాళులర్పించారు. ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్, టీడీపీ మండల అధ్యక్షుడు మిల్లుబాబు, తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షులు మోతుకూరి నానిబాబు, ఉషా పిక్చర్స్ అధినేత వడ్లపట్ల బాల కృష్ణారావు, గోదావరి కాల్వ డీసీ ఛైర్మన్ వెలమాటి రాంబాబు, కసుకుర్తి రామకృష్ణ, మాజీ ఎంపీటీసీ నిట్టా సుధాకర్ సర్పంచ్‌లు మానుబోలు వెంకటదుర్గ రాజు, పి.కన్నాపురం సర్పంచ్ దాసరి సుబ్బలక్ష్మి, మాజీ సర్పంచ్ బూసి రత్నాంజలి ఆమె నివాసానికి వెళ్లి నివాళులర్పించారు.

అభయాంజనేయ స్వామి ఆలయం వద్ద అన్నదానం

పెదపాడు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : పెదపాడు మండలం అప్పనవీడులో ప్రసిద్ధి చెందిన అభయాంజనేయ స్వామి దేవాలయం వద్ద దాతల సహకారంతో సుమారు 200 మంది భక్తులకు అన్నదానం నిర్వహించినట్లుగా ఆలయ ఇవో పి.తారకేశ్వరరావు తెలిపారు. హనుమాన్‌జంక్షన్‌కు చెందిన బాలాజీ కాఫీ అండ్ జనరల్ స్టోర్స్ పరిశ నారాయణరావు ఆర్థిక సహకారంతో అన్నదానం నిర్వహించినట్లు చెప్పారు. తొలుత స్వామిని ప్రత్యేక అలంకరణ చేసి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో దేవాలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి

ఏలూరు టూటౌన్, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి) : మున్సిపల్ కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. దశల వారీ ఆందోళనలో భాగంగా మంగళవారం నగర పాలక సంస్థ కార్యాలయం వద్ద ఉద్యోగులు నిరసన చేపట్టారు. మున్సిపల్ కమిషనర్ ఎ.భాను ప్రతాప్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం శ్రీనివాస్ మాట్లాడుతూ మున్సిపల్ ఉద్యోగులు, కార్మికుల వేతనాలను మున్సిపల్ శాఖ నుంచే చెల్లించాలని కోరారు. ఉద్యోగులను ప్రైవేటు ఏజెన్సీలకు అప్పగించే ఆలోచన విరమించుకోవాలన్నారు. జంగారెడ్డిగూడెం మున్సిపల్ కమిషనర్ కెవి.రమణకు ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు కె.విఘ్నేష్ ఆధ్వర్యంలో సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో పట్టణ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షుడు జెవి.రమణరాజు, కుంచె వసంతరావు, యూనియన్ నాయకులు బి.శ్రీను, కె.వెంకట్రావు, ఎన్.సుబ్బారావు, ముత్యాలరావు పాల్గొన్నారు.

స్త్రీ శక్తి పురస్కారానికి బోయపాటి రామలక్ష్మి ఎంపిక



ఏలూరు అర్బన్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : మహిళల అభ్యుదయానికి విశేష సేవలందించిన వారికి 'స్త్రీ శక్తి' అవార్డు అందజేస్తున్నట్టు సర్వోదయ మండలి ఉమ్మడి జిల్లా ప్రధానకార్యదర్శి ఇందుకూరి ప్రసాదరాజు తెలిపారు. 22వ తేదీన కస్తూరిబా గాంధీ 81వ వర్ధంతిని పురస్కరించుకుని స్త్రీ శక్తి అవార్డుకు ఏలూరు జిల్లాకు చెందిన బోయపాటి రామలక్ష్మిని ఎంపికచేసినట్టు తెలిపారు. బాలికల విద్యకు, మహిళా సంరక్షణకు, వారి సంక్షేమానికి, ఉపాధికి రామలక్ష్మి విశేష సేవలం దించారని అన్నారు. ప్రకాశరావుపాలెం గ్రామానికి చెందిన రామలక్ష్మి ప్రభుత్వ కళాశాలల్లో అధ్యాపకురాలిగా, ప్రిన్సిపాల్‌గా పనిచేసి రిటైర్ అయ్యారని తెలిపారు. ఏప్రిల్ 18న నిర్వహించే కార్యక్రమంలో రామలక్ష్మికి స్త్రీశక్తి పురస్కారాన్ని అందజేస్తామన్నారు.

ఉపాధి హామీ బాధిత కూలీలను ఆదుకోవాలి

ఏలూరు కార్పొరేషన్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : మృతి చెందిన ఉపాధి కూలీ కుటుంబాన్ని రాష్ట్ర ప్రభుత్వమే ఆదుకోవాలని, గాయపడిన వారికి మెరుగైన వైద్య సేవలు అందించాలని సీపీఎం ఏలూరు జిల్లా కార్యదర్శి ఎ.రవి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొయ్యలగూడెం మండలం కుంతలగూడెం పంచాయతీ పరిధిలోని ఉపాధి కూలీలపై ట్రాక్టర్ దూసుకెళ్లడంతో భాగ్యవతి అనే మహిళ అక్కడికక్కడే మృతి చెందగా మరికొందరికి గాయాలైనట్టు తెలిపారు. ఈ ఘటనలో మృతి చెందిన భాగ్యవతి కుటుంబానికి పరిహారం అందించాలని కోరారు. గాయపడిన వారికి మెరుగైన వైద్య సేవలు అందించాలని కోరారు.

ఫర్నీచర్ షాపుల్లో విజిలెన్సు తనిఖీలు

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి) :ఏలూరు నగరంలోని పలు ఫర్నీచర్ షాపుల్లో అధిక ధరలు వసూలు చేస్తున్నారని ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా రీజినల్ విజిలెన్సు అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి వి.శ్రీరాంబాబుకు సమాచారం అందింది. దీంతో ఆయన ఆదేశాల మేరకు విజిలెన్సు ఎస్ఐ కె సీతారామ్, తూనికలు కొలతల అధికారి వి ప్రశాంత్‌కుమార్ వారి సిబ్బందితో ఏలూరులో మంగళవారం రెండు షాపుల్లో తనిఖీలు చేశారు. విక్రయిస్తున్న ఫర్నీచర్‌పై వివరాలు లేకపోవడాన్ని గుర్తించి ఐదు కేసులు నమోదు చేశారు.

నలుగురిపై చీటింగ్ కేసు నమోదు

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి) : ఒక కంపెనీలో పని చేస్తున్న క్యాషియర్ మరో ముగ్గురు ఉద్యోగులు కలిసి నగదు దుర్వినియోగానికి పాల్పడ్డారని పోలీసులకు ఫిర్యాదు అందడంతో కేసు నమోదు చేశారు. ఏలూరు త్రిటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సత్రంపాడులో ఉన్న ఇవాన్ ఇండియన్ హౌసింగ్ ఫైనాన్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో క్యాషియర్‌గా పనిచేస్తున్న ఏలూరు ఆదివారపుపేటనకు చెందిన పేరూరీ ఆది సత్యకుమార్‌కు అతని భార్య సింధుజ, తండ్రి పుల్లారావు, కొలగాని గణేష్‌లు కలిసి కంపెనీకి డిపాజిట్ చేయాల్సిన 10లక్షల 84 వేల ఏడు రూపాయలను స్వాహా చేశారు. దీంతో ఆ నలుగురిపై పోలీసులు చీటింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

అరకొర వసతుల్లోనే..

చేగొండపల్లి పునరావాస కాలనీలలో నిర్మాణానికి నోచుకోని ప్రభుత్వ భవనాలు

చాలీచాలని గదిలోనే సచివాలయం - ఇబ్బందులు ఎదుర్కొంటున్న సిబ్బంది, ప్రజలు



అసంపూర్ణంగా ఉన్న చేగొండపల్లి సచివాలయ భవనం

పోలవరం, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి) : పోలవరం మండలం చేగొండపల్లి పునరావాస కాలనీలలో గత ప్రభుత్వ పాలనలో ప్రారంభించిన భవనాల నిర్మాణం అసంపూర్ణంగా నిలిచిపోవడంతో నిర్వాసితులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రస్తుత కార్యాలయంలో కనీసం నలుగురు నిలబడి మాట్లాడటానికి కూడా జాగా లేదు. దీంతో సచివాలయ కార్యకలాపాల నిర్వహణలో సిబ్బంది ఇబ్బందులకు గురవుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో నిర్మాణం ప్రారంభించిన రెండంతస్థుల సచివాలయ భవనం నిర్మాణం నిలిచిపోయింది. సమీపంలోనే నిర్మిస్తున్న హెల్త్ సెంటర్ నిర్మాణం కూడా మొండిగోడల స్థాయిలోనే నిలిచిపోయింది. ఆ భవనాలకు సమీపంలో ఉన్న గిరిజన ఉత్పత్తుల భవనం నిర్మాణం నిర్మాణానికి నోచుకోక శిథిలావస్థకు చేరుకుంది. ఈ భవనాల నిర్మాణాలు పూర్తికాకపోవడంతో సమీపంలో ఉన్న పునరావాస కాలనీలలో ఆయా ప్రభుత్వ కార్యాలయాల కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. భవనాల నిర్మాణ కాంట్రాక్టర్లకు బిల్లులు కాకపోవడంతో నిర్మాణాలు నిలిచిపోయాయని అధికారులు చెబుతున్నారు. ఎలాంటి భద్రతా లేని కాలనీలలో కార్యాలయ స్టేషనరీకి రక్షణ ఉండదని అధికారులు ప్రభుత్వం స్పందించి భవనాల నిర్మాణం త్వరిత గతిన పూర్తి చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.



మొండిగోడలతో దర్శనమిస్తున్న హెల్త్ సెంటర్

పేరాబత్తుల రాజశేఖరంను గెలిపించండి

విస్తృతంగా కూటమి నాయకుల ప్రచారం

ఏలూరు, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి) : కూటమి బలపరచిన గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరంను మొదటి ప్రాధాన్యతా ఓటు వేసి గెలిపించాలని టీడీపీ సీనియర్ నాయకుడు మండవ లక్ష్మణరావు కోరారు. జంగారెడ్డిగూడెంలో కూటమి నాయకుల ఆధ్వర్యంలో మంగళవారం ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలో ఉన్న పలు ప్రైవేటు పాఠశాల సిబ్బందిని, గ్రాడ్యుయేట్‌లను కలిసి ఓట్లు అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పరిమి సత్తిపండు, నంబూరి రామచంద్రరాజు, చిట్టిబోయిన రామలింగేశ్వర రావు, షేక్ ముస్తఫా, ఈడా శ్రీనివాస్, వలవల తాతాజీ, తూటిగుంట రాము, బొబ్బర రాజ్‌పాల్ కుమార్, చిట్రోజు తాతాజీ, జి.శ్రీదేవి, రాజీ పాల్గొన్నారు.

కడప ఎమ్మెల్సీ రామ్ గోపాల్ రెడ్డి ప్రచారం

ఉంగుటూరు : ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరం గెలుపునకు పట్టభద్రులు సహకరించాలని ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకులు, కడప ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామ్ గోపాల్ రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం ఉంగుటూరు మండలంలో ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు, టి.డి.పి జిల్లా అధ్యక్షులు గన్ని వీరాంజనేయులు, మాజీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహన్, బి.జే.పి. నాయకులు శరణాల మాలతీరాణి, అడపా శోభారాణి పాల్గొని ప్రచారం నిర్వహించారు.

గన్ని వీరాంజనేయులు దిశానిర్దేశం

చింతలపూడి : చింతలపూడిలో కూటమి ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయిలో ప్రచారం నిర్వహించారు. ఈ ప్రచారంలో టీడీపీ జిల్లా అధ్యక్షులు గన్ని వీరాంజనేయులు, ఎన్నికల ఇన్‌చార్జ్ రాంభూ పాల్ రెడ్డి, ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళీ, బీజేపీ జిల్లా అధ్యక్షులు విక్రమ్‌కిషోర్, జనసేన ఇన్‌చార్జి మేకా ఈశ్వరయ్య, జె.ముత్తారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే ఘంటా ఆధ్వర్యంలో

కామవరపుకోట : మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళీ ఆధ్వర్యంలో కామవరపుకోట వేంకటేశ్వర జూనియర్ కళాశాలలో ఉపాధ్యాయులకు నమూనా బ్యాలెట్ పత్రాలు అందజేశారు. ఆయన వెంట టీడీపీ మండల అధ్యక్షులు కిలారు సత్యనారాయణ, టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షులు వజీర్ ఖాన్, మాజీ ఎంపీటీసీ ఘంటా మాధవరావు ఉన్నారు.

ఎమ్మెల్యే చింతమనేని ఆధ్వర్యంలో

దెందులూరు/పెదవేగి/కుక్కునూరు : ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ఆధ్వర్యంలో పెదపాడు, పెదవేగి మండలాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వట్లూరులోని సర్‌సీఆర్ రెడ్డి ఇంజ నీరింగ్ కళాశాలలో, పెదవేగి మండలం కవ్వగుంట, గార్లమడుగు గ్రామాల్లో కూటమి నాయకులతో కలిసి ఎన్ని కల ప్రచారం నిర్వహించారు.కుక్కునూరు టీడీపీ మండలాధ్యక్షుడు ములిశెట్టి నాగేశ్వరరావులు హైదరాబాదులో ఉన్న పట్టభద్రులను కలిసి ఓట్లను అభ్యర్థించారు. అలాగే మండల పరిధిలోని బెస్తగూడెం, నెమలిపేట, రాయకోట గ్రామాల్లో ఎమ్మెల్సీ ఓటర్లను స్థానిక కూటమి నాయకులు కలిసి ఓట్లను అభ్యర్థించారు.



జంగారెడ్డిగూడెంలో కూటమి నాయకుల ప్రచారం

అభివృద్ధివైపే పట్టభద్రుల చూపు

ఏలూరు టూటౌన్/కొయ్యలగూడెం : పట్టభద్రులంతా అభివృద్ధికి పట్టం కట్టేందుకు సిద్ధంగా ఉన్నారని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. ఎమ్మెల్సీ అభ్యర్థి రాజశేఖరం గెలుపునకు మంగళవారం నగర పాలక సంస్థ కార్యాలయంలో ప్రచారం నిర్వహించారు. ఈ ప్రచారంలో నగర మేయర్ షేక్ నూర్జహాన్, షేక్ మీరావలి, కోఆప్షన్ సభ్యులు పెదబాబు, చోడే వెంకట రత్నం పాల్గొన్నారు. రాష్ట్ర ట్రైకార్ ఛైర్మన్ బొరగం శ్రీనివాస్ ఆధ్వర్యంలో కొయ్యలగూడెం మండలంలోని కన్నాపురం దిప్పకాయలపాడు, మంగపేట గ్రామాల్లో ఆయన పర్యటించారు.

బోధనా నైపుణ్యాన్ని మెరుగుపర్చుకోవాలి

పెదవేగి, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి) : అంగన్‌వాడీ కార్యకర్తలు బోధనా నైపుణ్యాన్ని మెరుగుపర్చుకోవాలని, అప్పుడే చిన్నారులకు అందించే పూర్వప్రాథమిక విద్యను మరింత మెరుగైన రీతిలో అందించే వీలుంటుందని పెదవేగి ఎంఈవో -2 వి.అరుణ్‌కుమార్ అన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలకు అందించే ఇన్‌సర్వీస్ సర్టిఫికెట్ కోర్సు శిక్షణలో భాగంగా పెదవేగి జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో మంగళవారం శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. చిన్నారుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని అంగన్‌వాడీ కార్యకర్తలు మరింత మెరుగైన బోధనా విధానం అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం బోధనా నైపుణ్యంపై ఏడాదికి 40రోజుల పాటు శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేసిందని అన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్పీలు సీహెచ్.పార్వతి, ఎం.లక్ష్మీనారాయణ, నవీన్, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



డ్రైనేజీ అంచున నిలిచి ఉంచిన కారు

డ్రెయినేజీలోకి దూసుకెళ్లిన కారు

ద్వారకాతిరుమల, ఫిబ్రవరి 18 (ఆంధ్ర జ్యోతి): శ్రీవారి దర్శనానికి ద్వారకాతిరుమల వచ్చిన యాత్రికుల కారు తిరుగు ప్రయాణంలో అదుపుతప్పి డ్రెయినేజీలోకి దూసుకెళ్లింది. ఆలయనికి వచ్చిన కొందరు భక్తులు తమస్వగ్రామానికి తిరుగుప్రయాణంలో వెళ్తూ రిలయన్స్ మార్ట్ వద్ద ఆగి పలు వస్తువులు కొనుగోలు చేశారు. అనంతరం కారును తీసి భీమడోలు వైపు మళ్లించగా అది వేగంగా డ్రెయినేజీలోకి దూసుకెళ్లింది. అయితే కారులో ఉన్న వారికి, అలాగే బయటి వారికి ఏమీ జరగక పోవడంతో పెద్ద ప్రమాదం తప్పినట్లు స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

విశిష్ట సంఖ్య నమోదు తప్పనిసరి

లింగపాలెం, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): ప్రతిరైతు విశిష్ట సంఖ్య నమోదు చేయించుకోవాలని తద్వారా ప్రభుత్వం నుంచి పొందే పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ, పంటల భీమా లాంటి పథకాలకు ఈ నెంబరు ఉపయోగపడుతుందని జిల్లా వ్యవసాయ అధికారి హబీబ్ బాషా అన్నారు. మంగళవారం మండలంలోని కలరాయనగూడెంలో జరుగుతున్న పొలం పిలుస్తుంది కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి హబీబ్ బాషా ,సెరీకల్చర్ డీడీఏ వాణి పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ వ్యవసాయ రంగాన్ని అధునీకరించడంతో పాటు కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు అందించే అన్ని పథకాలకు, రాయితీలకు రైతు విశిష్ట సంఖ్య నమోదు అవసరమన్నారు. అనంతరం గ్రామంలో పంట పొలాలను పరిశీలించి పంటల దిగుబడులు పెరిగేందుకు రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, యాజమాన్య పద్ధతులపై పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి కె.మురళీకృష్ణ, వ్యవసాయ శాఖ సిబ్బంది, పలువురు రైతులు పాల్గొన్నారు.



ఎస్పీకి వినతిపత్రం అందజేస్తున్న జర్నలిస్టులు

విలేకరిపై దాడి సరికాదు

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : విలేకరిపై దాడిని ఖండిస్తూ ఏలూరులో జర్నలిస్టులంతా ర్యాలీ నిర్వహించి అనంతరం ఎస్పీ ప్రతాప్ శివ కిశక్షర్‌కు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రజాశక్తి అడ్వటైజ్‌మెంట్ విభాగం జనరల్ మేనేజర్ తిరుపాల్‌రెడ్డి, యూనియన్ నాయకులు కె.మాణిక్యాలారవు, జీవీఎస్ఎన్ రాజు, రఘురాం, జబీర్, కెపికె కిషోర్, పి గంగరాజు తదితరులు ఎస్పీతో మాట్లాడుతూ జర్నలిస్టులపై దాడులు బాధాకరమని అన్నారు. ఇలాంటివి పునరావృతం కాకుండా పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

వేలేరుపాడు మండలంలో ఫిర్యాదు...

వేలేరుపాడు/లింగపాలెం, ఫిబ్రవరి18 (ఆంధ్రజ్యోతి) : పార్వతీపురం మన్యం జిల్లాలో మక్కువ మండలంలో విలేకరి మల్లియాడ రామారావు పై దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని వేలేరుపాడు మండల ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో సభ్యులు తహసీల్దార్ డీవీ సత్యనారాయణకు వినతిపత్రం అందజేశారు.అనంతరం పోలీస్ స్టేషన్‌కు వెళ్ళి ఎస్సై రామారావుకు ఫిర్యాదు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ సభ్యులు శివాజీ, అనీల్ కుమార్, దాసరి శివరామకృష్ణ, మధు, శివరామ్, ఎండీ నజీమ్, ఉన్నారు. లింగపాలెంలో ఇంచార్జ్ తహసీల్దార్ ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు.విలేకరులపై దాడులు జరిపిన వారిని కఠినంగా శిక్షించాలని అన్నారు.

టి.నరసాపురం మండలంలో ఫిర్యాదు..

టి.నరసాపురం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): విలేకరిపై దాడిని ఖండిస్తూ ఎస్సై ఎం.జయబాబు, తహసీల్దార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ హరిబాబులకు టినరసాపురం మండల ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో విలేఖరులు వినతిపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ సభ్యులు మూర్తి, నాదెండ్ల కృష్ణ, యు.ప్రసాద్ బాబు, జి.నాగరాజు, మరీదు నాగేశ్వరరావు, ఎస్.రామకృష్ణ, నాయుడు జోగేశ్వరరావు, వేల్పుల సుందరం, విష్ణు, రామ్మోహన్‌రావు, జి.వెంకటేశ్వరరావు, మంగరాజు, మహేష్ పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు

చింతలపూడి, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి) : యర్రగుంటపల్లి గ్రామంలో విజిలెన్స్, రెవెన్యూ, వ్యవసాయ అధికారులు ఎరువులు, పురుగు మందుల షాపులపై తనిఖీ జరిపారు. లావణ్య ట్రేడర్స్‌లో నిల్వల్లో వ్యత్యాసాన్ని గుర్తించారు. మరో దుకాణం శ్రీలక్ష్మి ట్రేడర్స్‌లో ధృవపత్రాలు లేని 16 వేల 50 రూపాయలు విలువ కలిగిన 9.550 మెట్రిక్ టన్నుల ఎరువులను గుర్తించి అమ్మకాలు నిలుపుదల చేశామని తెలిపారు. ఈ తనిఖీల్లో విజిలెన్స్ ఏవో జి.మీరయ్య, మండల వ్యవసాయాధికారి కె.మీనాకుమారి, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

'వీఆర్వోలకు న్యాయం చేయండి'

ఏలూరు రూరల్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : గ్రామ, వార్డు సచివాలయాల రేషనలైజేషన్‌లో వీఆర్వోలకు తీవ్ర అన్యాయం జరుగుతోందని, గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు భూపతిరాజు రవీంద్రరాజు ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామ స్థాయిలో రైతులకు, ప్రజలకు కావాల్సిన సర్టిఫికెట్లు ఇస్తూ వీఆర్వోలు కీలకపాత్ర పోషించారని అన్నారు. వైసీపీ హయాంలో పని ఒత్తిడి పెరిగిందని, కూటమి ప్రభుత్వం వస్తే వీఆర్వోలకు మేలు జరుగుతుందని ఆశించామన్నారు. రెవెన్యూ శాఖలో ఖాళీ పోస్టులు భర్తీ చేయకుండా రెవెన్యూ ఉద్యోగులను ఒత్తిడికి గురి చేస్తున్నారని మండిపడ్డారు. సచివాలయాల పునరీవ్యవస్థీకరణను పునరాలోచించి నిర్ణయం తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

రెండు గ్రామాల్లో జ్వరాలపై సర్వే

ఉంగుటూరు, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి) : దోమలను నిర్మూలించే కార్యక్రమంలో భాగంగా డ్రైడే డ్రైడేపై ప్రజలను అప్రమత్తం చేయాలని తాడేపల్లిగూడెం మలేరియా యూనిట్ ఉప ఆరోగ్య అధికారి వై.వి.లక్ష్మణరావు అన్నారు. మంగళవారం చేబ్రోలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని గోపీనాథపట్నం, కొత్తగూడెంలో ఆరోగ్య కార్యక్రమాల అమలుపై సర్వే జరిపి ప్రజలను అప్రమత్తం చేసేందుకు ర్యాలీ నిర్వహించారు.కార్యక్రమంలో ఎం.ఎల్.హెచ్.పి. కె.శ్రీనివాసరావు, అంగన్వాడీ కార్యకర్త రత్నకుమారి ఆశాలు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలి

ఏలూరు అర్బన్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు పెండింగ్‌లో ఉన్న మోనూ చార్జీలు, మూడు నెలల గౌరవ వేతనాలను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం సీఐటీయూ నేతృత్వంలోని భోజన పథకం మహిళా కార్మికులు డీఈవో వెంకట లక్ష్మమ్మకు వినతిపత్రాన్ని అందజేశారు. గతేడాది డిసెంబరు నుంచి మెనూ బిల్లులు, గౌరవ వేతనం బకాయిలు చెల్లించకపోవడంతో అప్పులుచేసి విద్యార్థులకు భోజనం వండిపెడుతున్నామని డీఈవోకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఏపీ మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగమణి, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు లింగరాజు, విజయలక్ష్మి పాల్గొన్నారు.

రైతులు పేర్లు నమోదు చేయించుకోవాలి

పెదపాడు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : రైతులంతా ఫార్మర్ రిజిస్ట్రీలో తమ పేర్లు నమోదు చేసుకోవడం ద్వారా వారికి ప్రధాన మంత్రి కిసాన్ సబ్సిడీ ప్రయోజనాలు లభిస్తాయని పెదపాడు మండల వ్యవసాయాధికారి వి.ప్రదీప్ కుమార్ తెలిపారు. పెదపాడు మండలంలోని ఏపూరు, కొత్తముప్పర్రు గ్రామాల్లో పొలం పిలుస్తోంది గ్రామ సభలను, క్షేత్రస్థాయిలో పంటలపై అవగాహన కార్యక్రమాలను మంగళవారం నిర్వహించారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది రమణ, సుందర్ ఉమ, ఉత్తేజ్, ఆశాజ్యోతి, రైతులు పాల్గొన్నారు.

వీరాంజనేయ స్వామికి అభిషేకాలు

ఏలూరు కార్పొరేషన్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : సత్రంపాడులోని అంబికాదేవి ఆలయ ప్రాంగణంలోని వీరాంజనేయ స్వామికి భక్తులు మంగళవారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. తమలపాకులు, సింధూరంతో గోత్రనామాలతో అర్చనలు జరిపారు. హనుమాన్ చాలీసా పారాయణ నిర్వహించారు.



శిలాఫలకంపై ఉన్న జగన్, మాజీ ఎమ్మెల్యేల ఫొటోలు

కోడ్ కూసినా ముసుగు పడలేదు..

ఏలూరు, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి) : ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నా మాజీ సీఎం, ఎమ్మెల్యేల ఫోటోలు బహిరంగంగా దర్శనమిస్తున్నాయి. పోలవరం మండలం చేగొండపల్లి గ్రామంలో రైతు సేవా కేంద్రంపై మాజీ సీఎం, ఎమ్మెల్యేల ఫోటోలు అలాగే వదిలేయడంతో అధికారుల తీరుపై పలువురు అసహనం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు ఇకనైనా స్పందించి చర్యలు తీసుకోవాలని రాజకీయ పార్టీల నేతలు కోరుతున్నారు.

పౌష్టికాహారం అందించాలి

కొయ్యలగూడెం, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): పిల్లలకు పౌష్టికాహారం అందించడంలో అంగన్వాడీల పాత్ర ఎంతో ఉందని మండల విద్యాశాఖాధికారి సురేష్ బాబు, సెక్టార్ సూపర్‌వైజర్ సరస్వతి కోరారు. ఈ మేరకు మంగళవారం బాలుర పాఠశాలలో మండలంలోని అంగన్వాడీ కార్యకర్తలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రభుత్వం నుంచి వచ్చే అన్ని పథకాలు చిన్నారులకు చేరేలా అంగన్వాడీ కార్యకర్తలు చిత్తశుద్ధితో పని చేయాలని కోరారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జయప్రదం చేయండి : ఎంఆర్పీఎస్

పోలవరం, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి) : మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు ఈనెల 23న అనంతపురంలో నిర్వహించనున్న ఎంఆర్పీఎస్, ఎంఎస్పీ అనుబంధ సంఘాల రాష్ట్ర కార్యవర్గ సమావేశాన్ని జయప్రదం చేయాలని ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర నేత విస్సంపల్లి సిద్ధు మాదిగ పిలుపునిచ్చారు. మంగళవారం పోలవరంలో స్థానిక నేత ఉండ్రాజవరపు వెంకట రమణమూర్తి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ అంబేడ్కర్ స్ఫూర్తికి వ్యతిరేకంగా పనిచేసే కొన్ని శక్తులు ఎస్సీ వర్గీకరణను అడ్డుకుంటున్నాయని అన్నారు. వర్గీకరణ వల్ల 59 ఉప కులాలకు న్యాయం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాదిగ నేతలు కడిమి చైతన్య కుమార్ మాదిగ, కడిమి నాగేశ్వరరావు మాదిగ, తోలేటి రఘు మాదిగ, కంభంపాటి జాన సుందరం మాదిగ, చాపల రాజేంద్ర మాదిగ పాల్గొన్నారు.

జ్ఞానజ్యోతిపై అవగాహన

భీమడోలు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : జ్ఞానజ్యోతి కార్యక్రమంపై అంగన్‌వాడీ కార్యకర్తలకు ఈనెల 18 నుంచి 25 వరకూ శిక్షణా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు హెచ్ఎం శ్రీనివాసరావు తెలిపారు. రానున్నా విద్యాసంవత్సరం నుంచి అంగన్‌వాడీ కేంద్రాల్లో టీచర్లు అమలు చేయాల్సిన అకడమిక్ సెషన్స్ పీఆర్‌పీలు నాగేశ్వరరావు, గోపాలకృష్ణ, సత్యప్రసాద్ జ్ఞానజ్యోతి కార్యక్రమం గురించి అవగాహన కల్పించారు.

స్వామివార్ల సన్నిధిలో ఎమ్మెల్యేలు

ద్వారకాతిరుమల, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి) : ద్వారకాతిరుమల శ్రీవారి ఆలయాన్ని ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు మంగళవారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ అధికారులు సాదర స్వాగతం పలికి స్వామి దర్శనం కల్పించారు. అలాగే ఐ.ఎస్. జగన్నాథపురంలోని శ్రీలక్ష్మీనారసింహ స్వామి ఆలయాన్ని పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు మంగళవారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ముందుగా మూలవిరాట్‌ను దర్శించి ప్రత్యేక పూజలు జరుపుకున్నారు.

'ప్రజల గొంతుకను గెలిపించండి'

ఏలూరు కార్పొరేషన్, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి) : ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక ప్రజా సంఘాలు బలపరిచిన పీడీఎఫ్ అభ్యర్థి దిడ్ల వీరరాఘవులును గెలిపించాలని ఉద్యోగ కార్మిక ప్రజా సంఘాల నాయకులు విజ్ఞప్తి చేశారు. మంగళవారం సీఐటీయూ కార్యాలయంలో వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రజా సమస్యలపై పోరాడే శక్తి పీడీఎఫ్ అభ్యర్థులకు మాత్రమే ఉందన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు డి.ఎన్.వి.డి. ప్రసాద్, ఆర్.లింగరాజు, టి.రామకృష్ణ, కె.శ్రీనివాస్, ఎం.నాగమణి, ఎ.రవి, పిల్లి రామకృష్ణ, జి.రవికిశోర్ ఉన్నారు.

కమిటీలతో బీజేపీ బలోపేతం


జీలుగుమిల్లి, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి) : గ్రామ స్థాయిలో కమిటీల ఏర్పాటు, సభ్యత్వాల నమోదు కార్యక్రమాల ద్వారా గిరిజన ప్రాంతంలో బీజేపీని బలోపేతం చేస్తున్నట్లు పార్టీ జిల్లా కార్యదర్శి చాట్రాతి ప్రసాద్ అన్నారు. జీలుగుమిల్లిలో మండల స్థాయి పార్టీ సమావేశం నిర్వహించారు. కేంద్రం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని గ్రామ కమిటీ సభ్యులకు సూచించారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బొరగం వెంకటలక్ష్మి, పార్టీ మండలాధ్యక్షులు గుడ్ల రాంబాబు, సీనియర్ నాయకులు కె.ఎల్.ప్రసాద్ ఉన్నారు.

కె.కోటలో రెండు పోలింగ్ కేంద్రాలు

కామవరపుకోట, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి) : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు గాను స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో రెండు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్టు తహసీల్దార్ గెడ్డం ఎలీషా మంగళవారం తెలిపారు. మొత్తం ఓటర్లు 1282 మంది ఉండగా అందులో పురుషులు 779 మంది, మహిళలు 503 మంది ఉన్నట్టు తహసీల్దార్ తెలిపారు. ఈ మేరకు పకడ్బందీగా ఏర్పాట్లు చేసినట్టు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ పి.రామకృష్ణ వివరించారు.

రోడ్డు పనుల పరిశీలన

పెదపాడు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గ పరిధిలోని గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో నాణ్యత ఉండాలని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. వట్లూరులో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా జరుగుతున్న రోడ్డు నిర్మాణ పనులను, నాణ్యతను ఎమ్మెల్యే చింతమనేని మంగళవారం తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, గ్రామస్థులు, అధికారులు పాల్గొన్నారు.



చనిపోయిన తాచు పాము

తాచు పాము హతం

ద్వారకాతిరుమల, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): ద్వారకాతిరుమల మండల పరిషత్ కార్యాలయం వద్ద ఓ తాచు పాము మంగళవారం రాత్రి తీవ్రకలకలం రేకెత్తించింది. ఆరడుగులున్న ఆ త్రాచును చూసిన స్థానికులు భీతిల్లారు. ఓ వ్యక్తి చొరవ తీసుకుని దానిని కడదేర్చాడు.

చట్టాలపై అవగాహన ఉండాలి

న్యాయ సేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి రత్నప్రసాద్

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : ప్రతి వ్యక్తి చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని, ప్రతి పౌరుడు చట్టానికి లోబడి నడుచుకోవాలని న్యాయ సేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి కె.రత్న ప్రసాద్ అన్నారు. ఏలూరు సమీపంలోని దుగ్గిరాలలో ఉన్న విన్సెంట్ డిగ్రీ కాలేజీలో డ్రైవింగ్ లైసెన్సు, వాహన నమోదు అంశాలపై అవగాహన సదస్సును జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న డీఎల్ఎస్ఏ కార్యదర్శి రత్న ప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులు రోడ్డు నిబంధనలను పాటించాలని ప్రతి ఒక్కరూ అవగాహన కల్పించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఏలూరు రవాణా శాఖ అధికారి కె.కృష్ణారావు మాట్లాడుతూ 18 సంవత్సరాల వయస్సు కల్గిన యువతీ, యువకులు మాత్రమే వాహనాలు నడపాలని అన్నారు. ఏలూరు త్రి టౌన్ ఎస్ఐ పి.రాంబాబు మాట్లాడుతూ ఒక వాహనం మీద ఇద్దరు మాత్రమే ప్రయాణించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సెయింట్ విన్సెంట్ కళాశాల ప్రిన్సిపల్ రోబిన్, న్యాయవాది కృష్ణారావు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న రత్న ప్రసాద్

ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో...

ఏలూరు అర్బన్ : జాతీయ రోడ్డుభద్రతా వారోత్సవాలను పురస్కరించుకుని మంగళవారం ప్రభుత్వ ఐటీఐ విద్యార్థులకు అవగాహన కల్పించారు. ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ సీఐ ఎస్.లక్ష్మణరావు మాట్లాడుతూ రహదారులపై వెళ్ళేటపుడు పాదచారులు, వాహనదారులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, రహదారి వెంబడివుండే వివిధ సంకేతాలకు అర్థాలు, హెల్మెట్ ధారణ ప్రాముఖ్యత తదితర అంశాలపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. ప్రిన్సిపాల్ పి.రజిత, ఇన్‌స్ట్రక్టర్లు పాల్గొన్నారు.



పడిపోయిన చికెన్ ఆధారిత వ్యాపారాలు

తాడేపల్లిగూడెం రూరల్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లిగూడెం పట్టణంలోని ఓ రెస్టారెంట్‌లో రోజూ 150 కేజీల చికెన్ వంటకాలు చేసేవారు. ఆదివారం అయితే 300 కేజీల వరకూ చికెన్ వండేవారు. బర్డ్‌ఫ్లూ భయంతో మాంసాహార ప్రియులు హోటల్స్‌కు వెళ్లడం మానేశారు. వెళ్లినా నాన్‌వెజ్ జోలికి వెళ్లడం లేదు. నాన్ వెజ్ తీసుకున్నా చికెన్ జోలికి అసలు వెళ్లడం లేదు. దీంతో ఆ హోటల్‌లో చికెన్ వినియోగం 10 కేజీలకు పడిపోయింది. ఇక్కడే కాదు.. ఉమ్మడి జిల్లాలో వైరస్ ప్రభావిత ప్రాంతాల్లో ఇలాంటి పరిస్థితే ఉంది..

కోళ్లకు సోకిన బర్డ్‌ఫ్లూ వైరస్‌తో ఉభయ గోదావరి జిల్లాల్లోని కోడిగుడ్లు, చికెన్‌పై ఆధారపడి చేసే వివిధ చిరు వ్యాపారాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. పట్టణం నుంచి పల్లె వరకూ విస్తరిం చిన చికెన్ బిర్యాని, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లలో చికెన్, గుడ్లను విరివిగా ఉపయోగిస్తారు. బిర్యానీ వినియోగంలో 90 శాతం చికెన్‌తో చేసిన వంటకాలనే ప్రజలు ఆహారంగా విని యోగిస్తున్నారు. వారం క్రితం తణుకు రూరల్ మండలం వేల్పూరు, పెరవలి మండలం కానూరు, ఉంగుటూరు మండలం బాదంపూడి గ్రామాల్లోని పౌల్ట్రీ ఫారాల్లో వెలుగు చూసిన బర్డ్ ఫ్లూ వైరస్ కారణంగా ఈ మూడు ఫారాలకు సుమారు 10 కిలోమీటర్ల పరిధిలో అలెర్ట్ జోన్‌గా అధికారులు ప్రకటించారు. దీనితో ఈ అలెర్ట్ జోన్‌లో చికెన్, కోడిగుడ్లు అమ్మకాలు, వినియోగంపై నిషేధం విధించారు. ఆయా గ్రామాలకు పది కిలోమీటర్ల పరిధి దాటిన తర్వాత ప్రాంతాల్లో కూడా చికెన్, కోడిగుడ్లు వినియోగం తగ్గిపోవడంతో పలావ్, బిర్యానీ, ఫ్రైడ్‌రైస్, అమ్మే దుకాణాలపై ప్రభావం ఎక్కువగా పడింది. గ్రామాలు మొదలు కొని పట్టణాల్లో వున్న బిర్యానీలు సెంటర్లు, చికెన్ పకోడి దుకాణాలు సుమారు 80 శాతం వరకూ మూతపడగా మిగిలిన వాటిలో మటన్, రొయ్యలతో తయారు చేసిన బిర్యా నీలు, పకోడీలను తయారు చేసి అమ్మకాలు సాగిస్తున్నారు.

బిర్యానీ, పకోడి దుకాణాలు చాలావరకూ మూతపడగా ఉన్నవాటిలో మటన్, రొయ్యలతో పలావు, బిర్యానీ తయారు చేసి అమ్ముతున్నారు. ధరలు ఎక్కువ కావడంతో బిర్యాని ధర కూడా పెంచడంతో కొనేవారు తగ్గిపోయారని దుకాణ దారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో 150 కిలోల నుంచి 200 కిలోల చికెన్‌తో తయారు చేసిన బిర్యానీ దుకాణాలు నేడు 10, 20 కిలోల మటన్, రొయ్యలతోనే బిర్యానీ తయారు చేసి అమ్మకాలు చేస్తున్నారు. గతంలో రూ. 60 నుంచి లభించే ఇప్పుడు రూ. 120 ఇంకా పైనే అమ్మకాలు జరుగుతున్నాయి.

కూలీలపైకి దూసుకెళ్లిన ట్రాక్టర్

మహిళ మృతి.. ముగ్గురికి గాయాలు


కూలీలను ఢీకొట్టి తిరగబడిన ట్రాక్టర్

కొయ్యలగూడెం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): ఉపాధి పనులు చేసుకుంటున్న కూలీలపై ట్రాక్టర్ దూసుకెళ్లింది. దీంతో ఒక మహిళ మృతి చెందగా మరో ముగ్గురికి గాయాలయ్యాయి. ఎస్సై చంద్రశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం కుంతలగూడెం గ్రామంలో ఉపాధి పనులు చేస్తుండగా రోడ్డుపై వెళ్తున్న ఒక ట్రాక్టర్ కూలీల మీదకు దూసుకెళ్లింది. దీంతో ఆ గ్రామానికి చెందిన అల్లే భాగ్యవతి (54) మృతి చెందగా మరో ముగ్గురు కూలీలైన బానుబోయిన పోసమ్మ, చాపల ఇమిలియ, రాపాక నాగమణికి తీవ్రగాయాలయ్యాయి. గాయాలైన ముగ్గుర్ని కొయ్య లగూడెం ఆసుపత్రికి తరలించారు. ట్రాక్టర్ అతివేగంగా వెళ్లి కూలీలను ఢీకొట్టాడు. సంఘటనా స్థలానికి ఎస్సై చంద్రశేఖర్, ఇన్‌ఛార్జ్ ఎంపీడీవో శ్రీనివాసరావు, ఏపీవో నాగేశ్వరరావు వెళ్లి పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పెద్దింటి అమ్మవారి జాతరకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు


పెద్దింటి అమ్మవారి జాతర పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఆర్డీవో

కైకలూరు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): కొల్లేటికోట పెద్దింటి అమ్మవారి జాతరలో భక్తులకు మెరుగైన సౌకర్యాలు అందించాలని ఏలూరు ఆర్డీవో అచ్యుత్ అంబరీష్ అన్నారు. కైకలూరు మండలం కొల్లేటికోట పెద్దింటి అమ్మవారి ఆలయ ప్రాంగణంలో జాతర ఏర్పాట్లపై అధికారులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. భక్తుల రద్దీ దృష్ట్యా క్యూలైన్ల ద్వారా దర్శనం కల్పించాలన్నారు. ఎక్కడికక్కడ మంచినీటి సదుపాయాలను కల్పించాలని, వాహనాల నిలుపుదలకు పార్కింగ్ ఏర్పాట్లును సర్కారుకాలువ నుంచి అమ్మవారి ఆలయం వరకు విద్యుత్‌లైట్లు ఏర్పాటు, శానిటైజేషన్ పనులపై చర్చించారు.భక్తులు స్నానాలు ఆచరించే చోట ప్రతీరోజు క్లోరినేషన్ చేయాలని సూచించారు. జాతర మహోత్సవాలపై వాల్‌పోస్టర్లు, బుక్‌లెట్‌లు, కరపత్రాలను ఆవి ష్కరించారు. తహసీల్దార్ ఎండీ ఇబ్రహీం, రూరల్ ఎస్సై రాంబాబు, ఆలయ ఈవో కూచిపూడి శ్రీనివాసు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.




కైకలూరు, పెదగొన్నూరులో కూటమి నాయకుల ప్రచారం, కలిదిండిలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్

ఆలపాటి విజయానికి సైనికుల్లా పని చేయాలి : ఎమ్మెల్యే కామినేని

కలిదిండి/ముదినేపల్లి /కైకలూరు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): గుంటూరు, ఉమ్మడి కృష్ణా జిల్లాల కూటమి గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ గెలుపు కోసం కూటమి నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ పిలుపునిచ్చారు. మంగళవారం కలిదిండిలో టీడీపీ మండల అధ్యక్షుడు పోకల జోగిరాజు అధ్యక్షతన ఎమ్మెల్సీ ఎన్నికలపై కూటమి నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న రాజేంద్ర ప్రసాద్‌ను శాసన మండలికి పంపిస్తే సమస్యల పరిష్కారానికి పనిచేస్తారన్నారు.

నియోజకవర్గ టీడీపీ పరిశీలకుడు మెంటే పార్థసారధి, సమన్వయ కమిటీ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు, మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠల్‌రావు, వల్లభనేని శ్రీనివాస్ చౌదరి, అంద్రాజు శ్రీనివాస్, బట్టు లీలా కనకదుర్గ, బెల్లంకొండ వెంకన్న బాబు, అంకాల దుర్గాప్రసాద్, భోగేశ్వరరావు, సత్యనారాయణ, వలవల రామారావు, చెన్నంశెట్టి మురళీకృష్ణ, చిట్టూరి రవీంద్ర, తదితరులు పాల్గొన్నారు. ఆలపాటి రాజేంద్ర ప్రసాద్‌ను గెలిపించాలని కోరుతూ ముదినేపల్లి మండలం పెదగొన్నూరు, విశ్వనాద్రిపాలెం, ఉప్పరగూడెం గ్రామాల్లో మంగళవారం కూటమి నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. టీడీపీ జనసేన నాయకులు గుడివాడ వేణు, నాగిరెడ్డి శివప్రసాద్, వీరంకి చక్రపాణి, గుడిసేవ సురేష్, గుడిసేవ రాజబాబు, బత్తుల మురళీకృష్ణ తదితరులు ప్రచారంలో పాల్గొన్నారు. కైకలూరులో ఎమ్మెల్సీ అభ్యర్థి గెలుపు కొరకు కూటమి నేతలు పట్టభద్రులను కలిసి ఓట్లను అభ్యర్థించారు. వీరాబత్తిన సుధా, మంగినేని రామకృష్ణ, బొల్లా శ్యామలరాజు, కంచర్ల రామకృష్ణ, పుప్పాల సూర్యప్రకాష్, బాజానీ పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

విద్యార్థులకు అవగాహన సదస్సు

ముదినేపల్లి, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): ముదినేపల్లిలోని ప్రైవేటు హైస్కూలు, గురజ, వడాలి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో మంగళవారం విద్యార్థులకు సైబర్ నేరాల నిరోధక చర్యలపై పోలీసు శాఖ అవగాహన కార్యక్రమాలను నిర్వహించింది. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, వివిధ రకాల సాంకేతిక పరిజ్ఞానాలతో మోసగాళ్ల నేరాలకు పాల్పడుతున్న తీరును ఎస్ఐ వి.వీరభద్రరావు విద్యార్థులకు వివరించారు. అభయ వాహనం ద్వారా కల్పించిన ఈ అవగాహన కార్యక్రమాల్లో ఏఎస్ఐ పద్మజ, పోలీసు సిబ్బంది, ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, టీచర్లు పాల్గొన్నారు.

ఆటో వివాదం కేసులో నిందితుడి అరెస్టు

ముదినేపల్లి, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): ముదినేపల్లి మండలం పేరూరులో గత నెల 17న ఆటో పార్కింగ్ వివాదంపై జరిగిన కొట్లాట కేసులో నిందితులను మంగళవారం అరెస్టు చేసినట్లు ఎస్ఐ వి.వీరభద్రరావు తెలిపారు. మనోగాంధీని కర్రతో కొట్టి గాయపర్చిన పేరూరుకు చెందిన డొక్కు ఏడు కొండలు, వణుదురుకు చెందిన వీరమల్లు హరీష్, పెయ్యేరుకు చెందిన మెరుగుమాల ఉదయ్‌లను అరెస్టు చేసి కైకలూరు కోర్టులో హాజరుపరిచినట్లు ఎస్ఐ తెలిపారు.

అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ


శిక్షణ ఇస్తున్న సీడీపీవో దీప్తి

ముదినేపల్లి, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కార్యకర్తలకు ముదినేపల్లి, పెదపాలపర్రు జిల్లా పరిషత్ హైస్కూళ్లలో ఐసీడీఎస్ సిబ్బంది మంగళవారం జ్ఞానజ్యోతి అంశాలపై శిక్షణ తరగతులను నిర్వహించారు. ఐసీడీఎస్ సీడీపీవో దీప్తి ఆధ్వర్యంలో ఎంఈవో నరేష్ కుమార్, సూపర్‌వైజర్లు ఝాన్సీ సుందరమ్మ శిక్షణ ఇచ్చారు. పిల్లలకు అభ్యసన బలోపేతం చేయడం, ఆటలు, పాటల ద్వారా అభ్యసన నిర్వహించడం, సమాజంలో భాగస్వామ్యంపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించడం ప్రధానమని రీసోర్స్ పర్సన్స్ నరసింహారావు, ఎన్.చంద్రశేఖర్ వివరించారు.

● మండవల్లి: మండవల్లి జడ్పీ హైస్కూల్‌లో అంగన్వాడీ కార్యకర్తలకు మంగళవారం మండల విద్యాధికారి రత్నసునంద, ఐసీడీఎస్ సీడీపీవో దీప్తి ఆధ్వర్యంలో జ్ఞానజ్యోతి కార్యక్రమంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నారులకు ప్రీప్రైమరీ స్కూల్లో బోధించ డానికి 120 రోజుల కార్యక్రమంలో భాగంగా అంగన్వాడీ కార్యకర్తలందరికీ విద్యాశాఖ ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమం ఇస్తున్నామన్నారు. తెలుగు, గణితం బోధనపై శిక్షకులు రూప్‌కుమార్, ప్రసాద్, తదితరులు శిక్షణ ఇచ్చారు. హైస్కూల్ హెచ్ఎం ప్రసాద్ సూపర్వైజర్లు నాగలక్ష్మి, లక్ష్మీప్రసన్న పాల్గొన్నారు.

భూ రీసర్వే వేగవంతం చేయాలి

కలిదిండి, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): భూ రీసర్వే వేగవంతం చేయాలని ఆర్డీవో అచ్యుత అంబరీష్ అన్నారు. మంగళవారం వెంకటాపురంలో భూ రీసర్వే పనులను పరిశీలించారు. ప్రణాళికాబద్ధంగా తప్పులు దొర్లకుండా చూడాలన్నారు. గత సర్వేలో తప్పులను సరి చేయాలన్నారు. రైతుల సమక్షంలో రీసర్వే నిర్వహించాలన్నారు. భూ సమస్యలపై వచ్చిన అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. తహసీల్దార్ రామకృష్ణ, ఆర్ఐ శ్యామల, సర్వేయర్ షమీ, వీఆర్వో కమల్, సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి ఆధార్ నమోదు శిబిరాలు

కలిదిండి, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): మండలంలో 0-6 ఏళ్ల వయసున్న చిన్నారుల వివరాల నమోదుకు బుధవారం నుంచి ఆధార్ శిబిరాలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో కొండలరావు ఒక ప్రకటనలో తెలిపారు. 19న పెదపుట్లపూడి, 20న పెదలంక, 21న మట్టగుంట గ్రామాల్లో శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. ఆధార్ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

21, 22 తేదీల్లో సబ్ జోన్ ఆటల పోటీలు

ముదినేపల్లి, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): కైకలూరు నియోజకవర్గస్థాయి ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల సబ్‌జోన్ ఆటల పోటీలు ఈనెల 21, 22 తేదీల్లో ముదినేపల్లి ఆరుతెగలపాడు జిల్లా పరిషత్ హైస్కూళ్ల ఆవరణలో నిర్వహించనున్నట్లు హెచ్‌ఎం వై.విజయ కుమార్ తెలిపారు. జిల్లా విద్యాశాఖాధికారి ఆదేశాల మేరకు ఈనెల 21న ముదినేపల్లి హైస్కూల్‌లో బాలికలకు, 22న ఆరుతెగలపాడు హైస్కూల్‌లో బాలురకు వాలీబాల్, త్రోబాల్, కబడ్డీ, ఖో-ఖో, అథ్లెటిక్స్, రన్నింగ్, లాంగ్ జంప్, షాట్ పుట్, డిస్కస్‌త్రో ఆటల పోటీలు నిర్వహించనున్నట్లు ఫిజికల్ డైరెక్టర్లు కోడే రోజా, పి.శ్రీనివాసరావు తెలిపారు.

సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి అభిషేకాలు

ముదినేపల్లి, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): సింగరాయపాలెం - చేవూరుపాలెం సెంటర్‌లో ఉన్న వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం భక్తులు అభిషేకాలు, పూజలు నిర్వహించారు. దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ ఆర్.గంగా శ్రీదేవి ఆధ్వర్యంలో ప్రధాన అర్చకుడు తోలేటి వీరభద్రశర్మ, కోట శివశంకర శర్మ అభిషేకాలు నిర్వహించారు.

కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి

ఏలూరు టూటౌన్, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి) : మున్సిపల్ కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. దశల వారీ ఆందోళనలో భాగంగా మంగళవారం నగర పాలక సంస్థ కార్యాలయం వద్ద ఉద్యోగులు నిరసన చేపట్టారు. మున్సిపల్ కమిషనర్ ఎ.భాను ప్రతాప్‌కు విన తిపత్రం అందజేశారు. అనంతరం శ్రీనివాస్ మాట్లాడుతూ మున్సిపల్ ఉద్యోగులు, కార్మికుల వేతనాలను మున్సిపల్ శాఖ నుంచే చెల్లించాలని కోరారు. ఉద్యో గులను ప్రైవేటు ఏజెన్సీలకు అప్పగించే ఆలోచన విరమించుకోవాలన్నారు. జంగారెడ్డిగూడెం మున్సిపల్ కమిషనర్ కెవి.రమణకు ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు కె.విఘ్నేష్ ఆధ్వర్యంలో సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో పట్టణ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షుడు జెవి.రమణరాజు, కుంచె వసంతరావు, యూనియన్ నాయకులు బి.శ్రీను, కె.వెంకట్రావు, ఎస్.సుబ్బారావు, ముత్యాలరావు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి సహకరించాలని వినతి


మంత్రికి గ్రామ సమస్యలు వివరిస్తున్న టీడీపీ నాయకులు

చాట్రాయి, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): చాట్రాయి మండలం బూరుగుగూడెం గ్రామ అభివృద్ధికి నిధులు కేటాయించాలని గృహనిర్మాణశాఖ మంత్రి కొలుసు పార్థసారథిని ఆ గ్రామ టీడీపీ నాయకులు మంగళవారం కలిసి విన్నవించారు. గ్రామంలో అంతర్గత రోడ్లు, డ్రెయిన్లు, మౌలిక వసతుల కల్పనకు నిధులు కేటాయించాలని టీడీపీ నాయకులు కాలసాని సూర్యనారాయణ(మాస్టారు), తేళ్ళూరి శేఖర్ తదితరులు కోరగా మంత్రి సానుకూలంగా స్పందించినట్లు నాయకులు తెలిపారు.

రఘునాథస్వామికి మంత్రి పార్థసారథి పూజలు

నూజివీడు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): గొల్లపల్లి రఘునాథస్వామిని రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి దర్శించుకుని మొక్కులు సమర్పించారు. ఈ సందర్భంగా సారథికి పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్‌లు పొట్లూరి సత్యనారాయణ, గోగినేని శ్రీనివాసకుమార్ అప్పారావు, తెలుగుదేశం పార్టీ నాయకులు గోగినేని మధు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు 12 పోలింగ్ కేంద్రాలు

నూజివీడు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మెల్సీ ఎన్నికలకు నూజివీడు నియోజకవర్గ పరిధిలో 12 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు నూజివీడు ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ బొందిలి రవికిరణ్ సింగ్ తెలిపారు. మంగళవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ నియోజకవర్గంలో 9,652 మంది గ్రాడ్యుయేట్లు తమ ఓటుహక్కును నమోదు చేసుకున్నట్లు తెలిపారు.

కాపు సంఘం అధ్యక్షుడిగా ముత్యాల కృష్ణ

నూజివీడు టౌన్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి):నూజివీడు పట్టణానికి చెందిన ప్రముఖ న్యాయవాది ముత్యాల వెంకటమురళీ మోహన్‌కృష్ణ కాపుసంఘం నూజివీడు నియోజకవర్గ అధ్యక్షునిగా ఎన్నిక అయ్యాడు. ఈ మేరకు జాతీయ కాపుసంఘం వ్యవస్థాపక అధ్యక్షులు కర్ణమురళీకృష్ణనాయుడు ఉత్తర్వులు జారీ చేశారు.

21, 22 తేదీల్లో నియోజకవర్గ స్థాయి క్రీడలు

ఆగిరిపల్లి, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): ఆగిరిపల్లి జిల్లాపరిషత్ హైస్కూల్‌లో 21, 22 తేదీల్లో నూజి వీడు నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీలు నిర్వహిస్తు న్నట్టు హెచ్‌ఎం పి.పుష్పలత తెలిపారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, త్రోబాల్, అథ్లెటిక్స్ పోటీలు జరుగుతా యని తెలిపారు.


మాట్లాడుతున్న ఎంఈవో సుబ్బారావు

అంగన్‌వాడీలకు శిక్షణ

ముసునూరు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): ముసునూరు జడ్పీ పాఠశాలలో జ్ఞానజ్యోతి 120 రోజుల శిక్షణ సర్టిఫికెట్ కోర్సులో భాగంగా అంగన్‌వాడీలకు జరుగుతున్న శిక్షణను మంగళవారం ఎంఈవో బీవీఎస్ సుబ్బారావు తనిఖీ చేశారు. శిక్షణలో రిసోర్స్‌పర్సన్‌లు డి.బెనర్జీ, బి.దుర్గాప్రసాద్, వరప్రసాద్, సూపర్‌వైజర్ జి.రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

సీఎం నిధి చెక్కుల పంపిణీ

ముసునూరు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): పేదవాడి పూర్తి ఆరోగ్య భద్రత కూటమి ప్రభుత్వానిదని మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. మండలంలోని పలు గ్రామాలకు చెందిన 10మంది ఆసుపత్రుల్లో చికిత్స పొందిన మెడికల్ బిల్లులకు ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి వచ్చిన సుమారు రూ.6లక్షల విలువగల చెక్కులను బాధిత కుటుంబ సభ్యులకు మంత్రి మంగళవారం అందజేశారు.

చెల్లని చెక్కు కేసులో ఒకరికి జైలు శిక్ష

నూజివీడు టౌన్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి):చెల్లనిచెక్కు కేసులో ఒకరికి ఆరు నెలలు జైలుశిక్ష, జరిమానా విధిస్తూ నూజివీడు స్పెషల్ మేజిస్ట్రేట్ వేల్పుల కృష్ణమూర్తి మంగళవారం తీర్పు చెప్పారు. వివరాల్లోకి వెళితే.. జంగారెడ్డిగూడెంకు చెందిన కర్రా ఎర్నెస్ట్ కుమార్‌కు గొల్లపల్లికి చెందిన మల్లవల్లి ప్రవీణ్‌కుమార్ రూ.10 లక్షల నగదును అప్పుగా ఇచ్చాడు. కొంతకాలం తరువాత బాకీ తీర్మానం నిమిత్తం ఎర్నెస్ట్ కుమార్ డిసెంబర్ 20, 2020లో రెండు చెక్కులను ఇవ్వగా, ఆ చెక్కులు బౌన్స్ అయ్యియి. దీంతో బాధితుడు ప్రవీణ్ కుమార్ నూజివీడు కోర్టును ఆశ్రయించగా, నూజివీడు స్పెషల్ మేజిస్ట్రేట్ కేసు విచారించి నిందితుడు కుమార్‌కు ఆరు నెలలు జైలుశిక్ష, రూ.12లక్షలు జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	95, 104, 115
చికెన్ విత్ స్కిన్	180
చికెన్ స్కిన్‌లెస్	190

నెక్ కోడి గుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ.475



చనుబండ, ముసునూరు గ్రామాల్లో టీడీపీ నాయకుల ఎన్నికల ప్రచారం

'ఆలపాటి'కి తొలి ప్రాధాన్యత ఓటు వేయండి

చాట్రాయి, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): కృష్ణా-గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గ కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు మొదటి ప్రాధాన్యతా ఓటు వేసి గెలిపించాలని మంగళవారం రాత్రి చాట్రాయి మండలం చనుబండ, సూరంపాలెం గ్రామాల్లో టీడీపీ నాయకులు నక్కా రాము, చీదిరాల మారేశ్వరరావు, బొట్టు దుర్గారావు, మోరంపూడి శ్రీరామ్, రమేష్ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఆలపాటిని గెలిపించాలని ముసునూరు మండలంలోని ముసునూరు, చింతలవల్లి, గోగులంపాడు గ్రామాల్లో టీడీపీ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు కొండేటి ఉదయ్ కిరణ్(బాబి), గద్దె రఘుబాబు, రాపర్ల బాలకృష్ణ, ఉప్పలపాటి గణేష్, నక్కా యోహాను, తోట శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మంత్రి కొలుసు ప్రచారం

ఆగిరిపల్లి : కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను గెలిపించాలని మంత్రి కొలుసు పార్థసారధి మంగళవారం అడవినెక్కలం, ఈదర, ఆగిరిపల్లిలో ప్రచారం నిర్వహించారు. కూటమి నాయకులు పాల్గొన్నారు.

పంజాబ్ నిఘా విభాగంలో నాగేశ్వరరావుకు కీలక బాధ్యతలు


నాగేశ్వరరావు

చాట్రాయి, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): పంజాబ్ నిఘా విభాగం ముఖ్య సంచాలకుడిగా ఏలూరు జిల్లా చాట్రాయి మండలం చనుబండ గ్రామానికి చెందిన గొల్లపల్లి నాగేశ్వరరావును నియమిస్తూ పంజాబ్ రాష్ట్ర ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. వరీందర్ కుమార్ స్థానంలో నాగేశ్వరరావు బాధ్యతలు చేపడతారు. 1995 బ్యాచ్ ఐపీఎస్ అధికారి అయిన నాగేశ్వరరావు ప్రస్తుతం పంజాబ్ పోలీస్ శాఖలో అదనపు డీజీపీ(ప్రొవిజనింగ్)గా పనిచేస్తున్నారు. అతి సామాన్య రైతు కుటుంబంలో పుట్టిన నాగేశ్వరరావు తల్లిదండ్రులు అంజయ్య, చిట్టిమ్మ ఆశయం మేరకు కష్టపడి చదివి పంజాబ్ క్యాడర్ ఐపీఎస్‌కు సెలక్ట్ అయ్యారు.

భవిష్యత్ నానో టెక్నాలజీదే


సెమినార్‌ను జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభిస్తున్న దృశ్యం

నూజివీడు టౌన్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ భవిష్యత్ నానో టెక్నాలజీపై ఆధారపడి ఉందని ఆస్ట్రేలియా అకాడమీ ఆఫ్ సైన్స్ అధ్యక్షుడు ప్రొఫెసర్ చెన్నుపాటి జగదీష్ అన్నారు. నూజివీడు ట్రిపుల్‌ఐటీ క్యాంపస్‌లో నానో టెక్నాలజీ, అప్లికేషన్స్‌పై సెమీనార్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ సెమీ కండెక్టర్ నానోస్ట్రక్చర్, ఎన్ఆర్‌జీ సైన్సెస్, న్యూరో సైన్స్ అప్లికేషన్స్ అనే అంశాల పై ఆయన విద్యార్థులకు వివరించారు. ట్రిపుల్‌ఐటీ డైరెక్టర్ అమరేంద్రకుమార్, అమరావతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ కెమికల్ ఇంజినీరింగ్ ఉపాధ్యక్షులు ఆర్.పార్థిబన్, ఆర్.ఫరగ్‌గోగటే, ఎం.వెంకటేశ్వరరావు విద్యార్థులకు పలు అంశాలను వివరించారు.

క్రీడాకారులకు బూట్ల వితరణ

నూజివీడు టౌన్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): నూజివీడు బాలికోన్నత పాఠశాల క్రీడాకారులకు నూజివీడు లయన్స్‌క్లబ్ కోఆర్డినేటర్ కోలాహలం రాజు బూట్లను వితరణగా అందించారు. కార్యక్రమంలో బాలికోన్నత పాఠశాల పి.డి సరళ తదితరులు పాల్గొన్నారు.


స్టడీ మెటీరియల్ అందజేత

ముసునూరు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): చెక్కపల్లి జడ్పీ పాఠశాలలో టెన్త్ విద్యార్థులకు ఉమ్మడి కృష్ణాజిల్లా పరిషత్ ఆధ్వర్యంలో మంగళవారం స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేశారు. హెచ్‌ఎం అబ్బాస్, సర్పంచ్ తల్లిబోయిన రాధిక, తదితరులు పాల్గొన్నారు.


చీపురుగూడెంలో మామిడితోటలు పరిశీలిస్తున్న అధికారిణి హేమ

మామిడిలో తామర, తేనె మంచు పురుగు

చాట్రాయి, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): మామిడి తోటల్లో తామర, తేనె మంచు పురుగు కన్పిస్తున్నదని మండల ఉద్యానశాఖ అధికారి ఆర్. హేమ తెలిపారు. చీపురుగూడెం, పోలవరం గ్రామాల్లో మామిడి తోటలను మంగళవారం రైతులతో కలిసి ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తామర, తేనె మంచు పురుగు నివారణకు తయోమిథాజమ్ 0.3 గ్రాములు లీటరు నీటికి, లేదా ఇమామెక్టిన్ బెంజ్‌యేట్ 0.4 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారి చెయ్యాలన్నారు. మంగు తెగులు ఉంటే నాటివో 1 గ్రాము లీటరు నీటికి కలిపి స్ప్రే చెయ్యాలని సూచించారు. అనంతరం పోతనపల్లిలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఏవో శివశంకర్, రైతుసేవా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.


విద్యార్థినులకు పరుపులు పంపిణీ చేస్తున్న దృశ్యం

విద్యార్థినులకు పరుపుల పంపిణీ

నూజివీడు టౌన్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): విద్యార్థినులకు వసతి సౌకర్యాల మెరుగుదలకు చర్యలు చేపడుతున్నట్లు నూజివీడు ట్రిపుల్‌ఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ అమరేంద్ర కుమార్ తెలిపారు. నూజివీడు ట్రిపుల్‌ఐటీ క్యాంపస్‌లో పీయూసీ ప్రథమ సంవత్సర విద్యార్థినుల వసతికి అవసరమైన పరుపులను పంపిణీ చేశారు. ట్రిపుల్‌ఐటీ ఏవో లక్ష్మణరావు, డిడబ్ల్యూఎస్ దుర్గాభవానీ, చీఫ్ వార్డెన్ పి.వి లక్ష్మణరావు పాల్గొన్నారు.